# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 5-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:74 పేజీలు:6 వెల: రూ.1/-


## ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాక

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో బీజేపీ పార్టీ బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహించనుంది. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ని ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈమేరకు బీజేపీ అధిష్ఠానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈ మేరకు మీడియాకు వివరాలు తెలిపారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ..యావత్ సమాజం సభకు హాజరుకావాలని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. బీజేపీ ప్రకటనతో బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీసీలు రెడీగా ఉన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలు బీజేపీ పార్టీకి మద్దతు పలుకుతున్నారు. బీసీల చిరకాల వాంఛ ముఖ్యమంత్రి పదవి. బీసీ ముఖ్యమంత్రి ప్రకటనను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవహేళన చేస్తున్నాయి. ఏఐసీపీ అగ్రనేత రాహుల్ గాంధీ, మంత్రి కేటీఆర్‌లు బీసీ సీఎం ప్రకటన పై వ్యగ్యంగా మాట్లాడారు. రాహుల్ గాంధీ, కేసీఆర్, కేటీఆర్ల మెడలు వంచాలని బీసీ సమాజాన్ని కోరుతున్నాను. బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించే దమ్ము బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఉందా? అని లక్ష్మణ్ సవాల్ విసిరారు.

## కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న సీఎం కేసీఆర్



సిద్దిపేట నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వెంకన్న సన్నిధిలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న సీఎం కేసీఆర్‌కు మంత్రి హరీశ్ రావు స్వాగతం పలుకగా, అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసి.. వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. స్వామివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలపై సీఎం కేసీఆర్ సంతకాలు చేశారు. ఎన్నికల్లో నామినేషన్ వేసే ప్రతిసారి కేసీఆర్ ఈ ఆలయంలో పూజలు చేస్తూ వస్తున్నారు. ఈ నెల 9న గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో నామినేషన్లు వేయనున్నారు. అదేరోజు బీఆర్ఎస్ ఆశీర్వాదసభల్లో పాల్గొననున్నారు. కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం సీఎం కేసీఆర్, పార్టీకి సెంటిమెంట్‌గా ఉంది. ఏ ఎన్నికలు వచ్చినా ఇక్కడ పూజలు చేసిన తర్వాతే సీఎం కేసీఆర్ నామినేషన్ వేస్తారు. సీఎం కేసీఆర్, హరీశ్‌రావు , ఇతర పార్టీ నేతలు ఎన్నికల సమయంలో వెంకన్నకు దర్శనం చేసుకొని స్వామివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. కోనాయిపల్లి వెంకన్నకు పూజలు చేసిన ప్రతిసారి సీఎం కేసీఆర్ కేసీఆర్‌కు విజయం వరించింది. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి 1989, 1994, 1999, 2001, 2004, 2009, 2014, 2018లో జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి, నామినేషన్ వేశారు. అన్ని సందర్భాల్లోనూ విజయం సాధించారు. మరో విశేషం ఏమిటంటే, 2001లో టీడీపీకి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన కేసీఆర్.. ఆ తర్వాత ఈ ఆలయంలోనే పూజలు చేసి టీఆర్ఎస్ పార్టీని ప్రకటించారు.

## జానారెడ్డికి కూడా కోరికలు పుట్టాయి..

**-మంత్రి కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు**



హైదరాబాద్, నవంబర్ 4:కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జానారెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎన్నికల్లో పోటీ చేయని జానారెడ్డికి కూడా సీఎం పదవిపై కోరికలు పుట్టాయని సెటైర్లు వేశారు కేటీఆర్. హైదరాబాద్ జలవిహార్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ న్యాయవాదుల సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ పార్టీకి 11 మంది ముఖ్యమంత్రులు దొరికారు.. కానీ ఓటర్లు దొరుకుతలేరు.. అయితే జానారెడ్డికి కూడా కోరికలు పుట్టాయి. విచిత్రం ఏందంటే జనారెడ్డి ఎన్నికల్లో కూడా పోటీ చేస్తలేరు. ఈ మధ్యన బలగం సినిమా వచ్చింది. అందులో ఓ పెద్ద మనిషి ఉంటడు. తాత లగ్గం చేసుకుంటావా అని అంటే.. పెళ్లి చేసుకోను అనడు.. నాకెవడు పిల్లను ఇస్తడురా అంటడు. జానారెడ్డి కథ కూడా అట్లనే ఉంది. ఎలక్షన్లలో పోటీ చేయడంట కానీ.. పదవులు మాత్రం వెతుక్కుంటూ వస్తాయట. ఇంతకంటే పెద్ద సిపాయి మనకు లేదు. జానారెడ్డి ఒక్కడే ఉన్నాడు.. ఇక పదవులు వెతుక్కుంటూ వస్తయంట. వాళ్లకు కావాల్సింది పదవులు, పైసలు. మళ్లా అర్జెంట్‌గా తెలంగాణలో జొర్రాలి. మొత్తం పదేండ్లు అధికారం మిస్ అయ్యారు.. ఇక ఇప్పుడు తెలంగాణ ప్రజల రక్తాలు పీల్చుకోవాలి అది వారి ఎజెండా అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇవాళ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఏమైతుందో చూడండి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ ముఖ్యమంత్రి శివకుమార్ మధ్య సంధి కదుర్చిరారు. ఇక ఇప్పుడు మూడో కృష్ణుడు మోపైండు. ఖర్గే కుమారుడు కూడా నేను కూడా సీఎం రేసులో ఉన్నానని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. ఇక మూడు క్యాంపులు.. ఫైవ్ స్టార్ హోటల్స్, బస్సులు.. 24 గంటలు టీవీల్లో చర్చలు. 6 నెలలకు ఒకసారి ముఖ్యమంత్రి మారుడు. రాజకీయ అస్థిరత. ఇది వరకు చూసిందే అని కేటీఆర్ ఆగ్రహం వెలిబుచ్చారు.

1991లో స్వయంగా చెన్నారెడ్డి చెప్పారు. మా పార్టీ వారే నన్ను దించి ముఖ్యమంత్రి అయ్యేందుకు హైదరాబాద్‌లో మతకల్లోలాల పేరిట 400 మందిని చంపింది మా కాంగ్రెస్ పార్టీ నాయకులని చెన్నారెడ్డి చెప్పారు. కాంగ్రెస్‌కు ప్రజల మీద ప్రేమ లేదు. పదవుల మీద మోజు తప్ప.. ఉద్యమంలో కలిసి రాలేదు. పదవుల కోసం పెదవులు మూసుకున్నారు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## తమిళనాడు రాష్ట్రాన్ని ముంచెత్తిన భారీ వర్షం

చెన్నయ్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తమిళనాడు రాష్ట్రాన్ని భారీ వర్షం ముంచెత్తింది. చెన్నై సహా పలు ప్రధాన నగరాల్లో శుక్రవారం నుంచి వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా చెన్నైలోని ప్రధాన రహదారులు మోకాళ్ల లోతు నీటితో నిండిపోయాయి. పలు కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ కేంద్రం హెచ్చరించింది.చెన్నైలో శనివారం ఉదయం నుంచి కూడా భారీ వర్షం కురుస్తోంది.

ఈ వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రానున్న రోజుల్లోనూ చెన్నైలో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో చెన్నైలోని పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.ఇక గత 24 గంటల్లో తమిళనాడులోని చిదంబరంలో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ ఎస్ బాలచంద్రన్ తెలిపారు. అదేవిధంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.

## కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

**– 'బి' ఫామ్‌ల కోసం చిన్న చిటుక పార్టీల కార్యాలయాల వద్ద క్యూలు**



హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); అసెంబ్లీ ఎన్నికలలో కీలక ఘట్టం శుక్రవారం మొదలైంది. ఎన్నికల బరిలో పోటీని ఖరారు చేసే నామినేషన్ల పర్వానికి అభ్యర్థులు తెరలేపారు. తొలి రోజున అంతంత మాత్రంగానే అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. ఈ క్రమంలో మహానగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆర్వో సెంటర్‌కు వంద మీటర్ల దూరంలో 144 సెక్షన్ విధించి ఏర్పాట్లు చేశారు.తొలి రోజున ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు మినహా స్వతంత్ర, రెబల్ అభ్యర్థులే నామినేషన్లు దాఖలు చేశారు.ఇది ఎలా ఉండగా పార్టీ పిరాయిన్పుల పర్వం కొనసాగుతుంది. ఆశా హహులు టిక్కెట్ల ఆశతో ఎదిరి చూస్తున్నారు. బేరసారాలు కొనసాగుతున్నాయి. ప్రచారం చేసుకునే వారు చేసుకుంటున్నారు. మరికొందరు జ్యోతిష్యులను సంప్రదిస్తుండగా, మరికొందరు'బి' ఫామ్ ల కోసం చిన్న చిటుక పార్టీలను సంప్రదిస్తున్నారు.ఇదే అదనుగా దోచుకునే వారు దోచుకుంటున్నారు.

## కారుకు ఓటేద్దాం.. కాలేరును గెలిపిద్దాం

**-అంబర్‌పేట్‌లో హోరుగా కాలేరు వెంకటేష్ ప్రచారం**



హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఐదు సంవత్సరాల నుండి అంబర్పేట అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన తనను మరోసారి గెలిపించాలని అంబర్పేట శాసనసభ్యులు, బి ఆర్ ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నియోజకవర్గంలోని గోల్నాక డివిజన్లో వీరన్న గుట్ట నుండి గోవింద్ నగర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అదేవిధంగా నల్లకుంట డివిజన్ వినయ్ నగర్ కాచిగూడ డివిజన్ బద్రుక కాలేజ్ వద్ద వివిధ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో మంత్రి కేటీఆర్ గారి సహకారంతో ఐదు సంవత్సరాల నుండి అంబర్పేట నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన తనకు ప్రజల నుండి విశేష స్పందన కనిపిస్తోందని నియోజకవర్గంలో ఎక్కడికి ఈ ప్రచార యాత్ర వెళ్లిన ప్రజలే తాము చేయి పట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారని ప్రజాస్పందనం చూస్తుంటే మరోసారి కచ్చితంగా మంచి మెజార్టీతో గెలుపొందుతానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బి ఆర్ ఎస్ కు హ్యాట్రిక్ విజయం తధ్యమని వారి నాయకత్వంలో మునుముందు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆయన అంబర్పేట ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీనివాస్, భూపతి లక్ష్మణ్, ఆర్కే బాబు, రెడ్డపాక రాము, నర్సింగ్ రావు, సురేష్, లింగం గౌడ్, బుచ్చిరెడ్డి, కన్నా , దేవేందర్ పోత్నాక్ శ్రీనివాస్,పోత్నక్ సంతోష్, వంజరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## నేపాల్‌ను వణికిస్తున్న వరుస భూకంపాలు

**-140 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేక మందికి గాయలు**

**-ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా.. సిద్ధంగా ఉండాలని హెచ్చరికలు జారీ**



ఖాట్మండ్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); హిమాలయ దేశం నేపాల్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. శుక్రవారం నేపాల్‌లోని వాయువ్య ప్రాంతంలో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రివేళ 11.32 గంటలకు భూమి కంపించింది. దీని తీవ్రత 6.4గా నమోదయిందని నేషనల్ ఎర్త్‌క్వేక్ మెజర్‌మెంట్ సెంటర్ తెలిపింది. ఈ ఘటనలో సుమారు 140 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.జాజర్‌కోట్ జిల్లాలోని లామిదండా ప్రాతంలో భూకంప కేంద్రం ఉన్నదని వెల్లడించింది. భూఅంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని పేర్కొంది. నెల రోజుల వ్యవధిలో నేపాల్‌లో భూకంపం రావడం ఇది మూడోసారి. దీనిప్రభావంతో ఉత్తర భారతదేశంలోనూ ప్రకంపణలు చోటు చేసుకున్నాయి. సుమారు 15 సెకన్లపాటు భూమి కంపించింది. శుక్రవారం రాత్రి 11.32 గంటలకు ఢిల్లీ, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి పరుగులు తీశారు. వరుస భూకంపాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారుగతంలో వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ లో పనిచేసిన భూకంప శాస్త్రవేత్త అజయ్ పాల్ కీలక సూచనలు జారీ చేశారు. నేపాల్‌లోని సెంట్రల్ బెల్ట్ ప్రాంతాన్ని 'భూకంపాలు ఎక్కువగా సంభవించే ప్రాంతంగా' గుర్తించినట్లు చెప్పారు. ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా.. సిద్ధంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

శుక్రవారం నేపాల్ చోటుచేసుకున్న భూకంపానికి సంబంధించి.. దోటి జిల్లాకు సమీపంలో భూకంప కేంద్రం ఉందని చెప్పారు. 2022 నవంబర్‌లో ఇదే జిల్లాలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించందని.. అప్పుడు ఆరుగురు మరణించారని తెలిపారు.

ఈ ఏడాది అక్టోబరు 3న నేపాల్‌లో వరుసగా సంభవించిన భూకంపాల శ్రేణి కూడా అదే ప్రాంతంలో ఉందని అజయ్ పాల్ వివరించారు. అవి కొద్దిగా పశ్చిమం వైపు ఉన్నప్పటికీ.. నేపాల్ సెంట్రల్ బెల్ట్ ప్రాంతానికి దగ్గరా ఉన్నట్లు తెలిపారు. ఏక్షణమైనా భూకంపాలు సంభవించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇక, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ ఉత్తరాన కదులుతున్నప్పుడు యురేషియన్ ప్లేట్‌తో విభేదిస్తున్నందున హిమాలయ ప్రాంతాన్ని 'ఎప్పుడైనా' భారీ భూకంపం తాకుతుందని పలువురు శాస్త్రవేత్తలు ఇదివరకే అంచనా వేసిన సంగతి తెలిసిందే. దాదాపు 40-50 మిలియన్ సంవత్సరాల క్రితం.. ఇండియన్ ప్లేట్ హిందూ మహాసముద్రం నుంచి ఉత్తరం వైపు కదిలి యురేషియన్ ప్లేట్‌ను తాకినప్పుడు హిమాలయాలు ఏర్పడ్డాయని చెబుతారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతివ్వాలి : హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, నవంబర్ 4: బీఆర్ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి ముస్లింలు మద్దతు ఇవ్వాలని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పిలుపునిచ్చారు. నర్సాపూర్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో, తొమ్మిది సంవత్సరాల తెలుగుదేశం పాలనలో తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు.

కాంగ్రెస్ పాలనలో హిందూముస్లింల మధ్య నిత్యం గొడవలు జరిగేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో హిందూముస్లింలు కలసిమెలసి జీవిస్తున్నారన్నారు. మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనోత్సవం ఒకేరోజు రావడంతో.. మిలాద్ ఉన్ నబీని వాయిదా వేయడం జరిగిందన్నారు.

ప్రభుత్వం ముస్లిం విద్యార్థుల కోసం ఎన్నో రెసిడెన్షియల్ పాఠశాలలను కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. విదేశాలలో చదివే పేద ముస్లిం విద్యార్థులకు రూ.20లక్షలు ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేశారన్నారు.

ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇచ్చి గౌరవిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.24 కోట్లు షాదీ ముబారక్ పథకం కింద అందజేయడం జరిగిందన్నారు. కేసీఆర్‌లాంటి మనిషి దేశంలో ఎవరూ లేరని.. కాంగ్రెస్ హయాంలో ఒక్క ముస్లిం వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వలేదన్నారు.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ యుక్తము గానట్టి పలు-కు
యుక్తుల యూ పానిపట్టు యుద్ధము లాగా
శక్తుల యూ దేశమునకు
భక్తిని జూపించె హేము ప్రథితాఖ్యుండై !!



-రాధశ్రీ

సెల్:9494481210

(5-11-1556 రెండవ పానిపట్టుయుద్ధం జరిగింది. అక్బరుకు, హేమచంద్ర విక్రమాదిత్య (హేము) మధ్య ఈ యుద్ధం జరిగింది.)

## నన్ను గెలిపించే బాధ్యత మీదే..! ఇంటింటి ప్రచారంలో మంత్రి తలసాని



హైదరాబాద్, నవంబర్ 4: ప్రజల బాధలన్నీ తీర్చానని.. ఎన్నికల్లో మరోసారి గెలిపించే బాధ్యత మీదేనని మంత్రి తలసాని, బీఆర్ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట డివిజన్ బీజేఆర్‌నగర్, ముస్లింబస్తీ, బండ మైసమ్మనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మొదట బాబు జగ్జీవన్‌రాం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాలువాలు కప్పి మంగళహారతులతో స్వాగతం పలికారు.

బస్తీల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, సమస్యల పరిష్కారానికి కృషి చేసిన కారు గుర్తుకే ఓటేస్తామని ముక్తకంఠంతో నినదించారు. బన్సీలాల్‌పేట డీ క్లాస్‌లో జేఎన్ఎన్ఆర్ఎం ఇండ్ల వద్ద మహిళలు, బండ మైసమ్మనగర్ డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద మంత్రిపై పుష్ప వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మురికి కూపాలు, ఇరుకైన ఇండ్లలో కనీస సౌకర్యాలు ఇబ్బందులుపడు తుండడం చూసి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఉచితంగా నిర్మించినట్లు చెప్పారు.

స్థానికంగా సీసీకెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని, కమ్యూనిటీ హాల్‌ను సైతం నిర్మిస్తామని చెప్పారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇండ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మాణం చేపట్టి.. 70వేల ఇండ్లను అర్హులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. మరో లక్ష ఇండ్లను సైతం నిర్మిస్తామన్నారు. కానీ, ప్రతిపక్ష పార్టీల నేతలకు ఆ ఇండ్లు కనిపించకపోవడం విచారకరమన్నారు.

కొందరు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వస్తారని.. తాను మాత్రం నిత్యం ప్రజలలోనే ఉంటాననే విషయం అందరికీ తెలుసునన్నారు. నిత్యం జనం మధ్యనే ఉంటూ.. ఏ అవసరం ఉన్నా అండగా ఉంటున్నానన్నారు. సమస్యలను పరిష్కరించి.. అభివృద్ధికి కృషి చేసిన తనను కారు గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## నిరంతర ప్రజా సంబంధాలే మళ్లీ నన్ను గెలిపిస్తాయి

**-డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్**



సికింద్రాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); సికింద్రాబాద్ పరిధిలో అన్ని వర్గాల ఆదరణ తమకే ఉందని, ప్రజలతో నిరంతరప్రజా సంబంధాలు, అనుబంధాలను కొనసాగిస్తున్నామని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అయన శనివారం సితాఫలమండీ డివిజను పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి గడప కు వెళుతూ ఓటర్లను కలుసుకొని తమకు మద్దతు తెలపాలని అభ్యర్థించారు. చిలకలగూడ, బడీ మసీద్ ఏరియా, చోటి మసీద్, ఎరుకల బస్తీ, లైఫ్ స్ప్రింగ్ ఆసుపత్రి, కింది బస్తీ, భవానీ నగర్, అన్నా నగర్ తదితర ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ ఎన్నికల ప్రచారం సాగింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఎన్నికల్లో భారీ ఆధిక్యతను సాధించుకుంటామని, ఓటర్లు తమనే ఆశిర్వదిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ బౌద్ధ నగర్ కార్పొరేటర్ కంది శైలజ, మెట్టుగూడ కార్పొరేటర్ రాసురి సునీత, అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి, బీఆర్ ఎస్ యువ నేతలు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, సితాఫలమండీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మైనారిటీ నేతలు ఈ పాదయాత్రకు తరలివచ్చి బీ ఆర్ ఎస్ కు, పద్మారావు కు అనుకూల నినాదాలతో హోరెత్తించారు.

# ప్రజాస్వామ్య విలువలు పలుచబడుతున్నాయా..!

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిన భారతంలో జరుగనున్న మనీ సాధారణ ఐదు రాష్ట్రాల (తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మిజోరామ్) ఎన్నికలు సమాధానం లేని పలు ప్రశ్నలను రెకెత్తిస్తున్నాయి. 'అత్యంత ఖరీదైన' ఎన్నికల స్వరూప స్వభావాల విపరీతాలను ఈ ఎన్నికలు తేటతెల్లం చేస్తున్నాయి. సర్వాధికారాలను లాకప్‌లో బంధించిన ఎన్నికల సంఘం కళ్ళకు గంతలు కట్టుకు కూర్చుంటోంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా చూపిన రుజువులు ఎండమావిలో నీళ్లు అవుతున్నాయి. ధన ప్రవాహంలో ప్రజాస్వామ్యం కొట్టుకుపోతోంది. డబ్బులు, మద్యం పంపిణీ యద్దేచ్ఛగా సాగి పోతున్నది. ఓట్ల సభలు ప్రజలకు ఉ పాధులు అవుతున్నాయి. సాధారణ ఓటరు బిత్తరపోయి చూస్తున్నాడు. ఎన్నికల నియమావళి బందీ కావడం, అరాచక రాజకీయ క్రీడల నిస్సిగ్గు చేష్టలను చూసి నివ్వెరపోతున్నాం. తాయిలాల ప్రకటనల్లో పార్టీలు రెచ్చిపోతున్నాయి.

## వేలంలో ఓటు:

'ధనమూలమిద్దం జగత్' అంటే ఏమిటో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. ఓటు అంటే వేలంలో కొనుక్కోవడమని తెలుస్తున్నది. ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఓడింది మాత్రం ప్రజాస్వామ్యమే అని విధితం అవుతున్నది.

కోట్ల నోట్లు ఇంటింటికీ వరదలా ప్రవహించడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని బరితెగించి బజారుకు ఈడుస్తున్నారు. పార్టీలు, సిద్ధాంతాలు, అభ్యర్థుల సచ్ఛీలతలు, అసంబద్ధ ఎన్నికల మానిఫెస్టోలు చెత్త బుట్టలో పడుతున్నాయి. నగదే నవ మంత్రమవుతున్నది. గతంలో డబ్బు పంచడం తెర వెనుక జరిగేది, నేడు బజారున పడడం నిత్యకృత్యమైంది. కుల సంఘాలు, మత సమూహాలు, గ్రామాలకు చుక్క ముక్కల రుచులు చూపడంతో ప్రజలు మద్యానికి శాశ్విత బానిసలుగా మారుతున్నారు.

ప్రభుత్వ ఉచిత 'బంధు' పథకాల ప్రకటనలు, వర్గాల వారీగా సంక్షేమ పథకాల వరాల జల్లులతో ప్రజలు తడిసి ముద్దైపోతున్నారు. ఎన్నికల పర్యవేక్షకులు, సిసిటీవీ కెమెరాలు, పోలీసు/మిలటరీ సాయుధ కవాతులు, ఎన్నికల సంఘ కఠిన నియమనిబంధనలు, జిల్లా యంత్రాంగాలు ప్రేక్షక పాత్రగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యం పట్టపగలే అమ్ముడుపోవడం చూస్తూ నివ్వెరపోతున్నాం.

## రెచ్చిపోతున్న ధనస్వామ్యం:

కొందరు సున్నిత ప్రజలు ధైర్యంగా ఓటుకు నోట్లను తిరస్కరించడం, అవినీతి నాయకులను ప్రశ్నించడం, మంచి మాటల సంస్కృతికి పట్టం కట్టడం కొంత ఊరటను ఇస్తున్నది. ప్రజాస్వామ్య నిర్వచనమే మారిపోయి 'నోటుస్వామ్యం' అయిపోతున్నది.

ధనస్వామ్యం దర్జాగా రెచ్చిపోతోంది. ఎన్నికల ప్రచారంలో ఉచిత పథకాల ప్రకటనలు హోరెత్తి పోయాయి. పరస్పర ధూషనలు సర్వసాధారణమయ్యాయి. చీకట్లో జరగాల్సిన నీచ కార్యాలు పట్టపగలే బాహాటంగా జరగడం కంటున్నాం. 'మా డబ్బే తిరిగి మాకు ఇస్తున్నారని' వాదించడం వింటున్నాం. కుడి చేత్తో తీసుకొని ఎడమ చేత్తో విదిలిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం చేయడం చూస్తున్నాం. ఎన్నికల్లో నిలబడటానికి వందల కోట్లు సిద్ధం చేసుకోవడమే అర్హతని, సామాన్యులు ఎన్నికల్లో పోటీపడడానికి అనర్హులని అర్థం అవుతున్నది.

## ఓటే వజ్రాయుధం:

ఇప్పటికైన జాతీయ/ప్రాంతీయ పార్టీలు ఆత్మవిమర్శ చేసుకోవాలి. పథకాలు, పాలన సామర్థ్యాలపైన మాత్రమే ఓట్లను ఆకర్షించడానికి తలుపులు తెరవాలి. డబ్బు ఆశ చూపి గెలిచినా, ప్రజల దృష్టిలో ఓడినట్లే అని తెలుసుకోవాలి. నోట్ల పంపిణీతో గెలిచిన అభ్యర్థులు అనేక రెట్లు సంపాదనకు దారులు తెరుస్తారని అవగాహనకు రాకపోతే ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధి గాల్లో దీపాలవుతాయనేది వాస్తవం. ఎన్నికల సంఘం నియమనిబంధనల కొరడా జులిపించాలి. అసలైన సేవకులైన నాయకుల్ని మాత్రమే గెలిపించాలి. నోట్లను ధిక్కరించే వజ్రాయుధ ఓట్లను సాసబట్టాలి.

అఖండ భారత ప్రజాస్వామ్యానికి పట్టాభిషేకం చేయాలి. ప్రజలే రాజులుగా నాయకులే సేవకులుగా మారాలి. మనం కలలు కన్న రామరాజ్య స్థాపన నిక్కంగా సత్వరమే రావాలి.



ప్రజాస్వామ్య విలువలకు ప్రజలే ఘనసన్మానం చేయాలి. నోటుస్వామ్యం అంతరించి ప్రజాస్వామ్య పునర్ ప్రతిష్ట జరగాలి. గాంధీ కలలు కన్న భారతాన్ని ఆవిష్కరించాలి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# కాలి వేలు నుంచి తల దాకా ప్రతి అవయవంపై వాయు కాలుష్యం ప్రభావం

**– సీనియర్ లంగ్ స్పెషలిస్ట్ అర్విండ్ కుమార్**

న్యూఢిల్లీ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశ రాజధాని ఢిల్లీతోపాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ అంతటా గాలి కాలుష్యం తీవ్రత పెరుగుతోంది. పంజాబ్‌లో రైతులు తమ పొలాల్లోని కొయ్య కాలును తగులబెడుతుండటం కూడా ఢిల్లీ, దాని పరిసరాల్లో కాలుష్య పెరగడానికి కారణమవుతున్నది.

ఎయిర్ పొల్యూషన్ కారణంగా ఢిల్లీలో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గాలి కాలుష్యం, ప్రజారోగ్యంపై దాని దుష్ప్రభావం గురించి వేదాంత హాస్పిటల్‌కు చెందిన సీనియర్ లంగ్ స్పెషలిస్ట్ అర్విండ్ కుమార్ వెల్లడించారు. మానవ శరీరంలో కాలి వేలు మొదలు తల వరకు గాలి కాలుష్యం కారణంగా ప్రభావితం కాని అవయవమే ఉండదని డాక్టర్ అర్విండ్ కుమార్ చెప్పారు. ఎయిర్ పొల్యూషన్ బాడీలోని ప్రతి పార్ట్‌ను అనారోగ్యం పాలయ్యేలా చేస్తుందని ఆయన తెలిపారు. వాయు కాలుష్యం వల్ల మనుషులు ముందుగా స్థూల కాయం బారిన పడుతారని అది క్రమంగా ఆస్తమాకు దారి తీస్తుందని తెలిపారు. వాయు కాలుష్యం ఊ బ కా య ం ా ని క ి కారణమవుతుందనడానికి ఇప్పుడు ఎన్నో రుజువులు ఉన్నాయని డాక్టర్ చెప్పారు. వాతావరణం కలుషితమైన ప్రాంతాల్లో నివసించే వారిలో చాలా మంది ఈ రెండు సమస్యల బారిన పడుతున్నారని డాక్టర్ అర్విండ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఆస్తమాతో బాధపడుతున్న వారి ఆరోగ్యం మరింత రిస్క్‌లో పడుతుందన్నారు. ఢిల్లీలోని 1100 మంది చిన్నారులపై తమ అధ్యయనం చేశామని, వారిలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు ఆస్తమా, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్నారని ఆయన చెప్పారు. భవిష్యత్తులో ఈ సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ వాయు కాలుష్యం అన్ని వయసుల వారిపై ప్రభావం చూపుతుందని డాక్టర్ అర్విండ్ చెప్పారు. తల్లి గర్భంలో ఉన్న బిడ్డలపై ఈ వాయు కాలుష్యం ప్రభావం ఉంటుందన్నారు. తల్లి తీసుకునే శ్వాస ద్వారా గాల్లోని విషాలు బిడ్డ రక్తంలో చేరతాయని చెప్పారు. ఢిల్లీలో ంఖిఎ 450-500 ఉందంటే రోజుకు 25 నుంచి 30 సిగరెట్లు తాగిన దాంతో సమానమని ఆయన తెలిపారు. దాంతో రకరకాల శ్వాస సమస్యలు వస్తాయని అన్నారు.

# చంద్రబాబును కలిసిన పవన్ కల్యాణ్

అమరావతి, నవంబర్ 4:టీడీపీ అధినేత చంద్రబాబును జనసేన అధినేత పవన్ కల్యాణ్ పరామర్శించారు. చంద్రబాబు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో గల చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు. ఇకపోతే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి పోటీ చేస్తాయని చంద్రబాబు రిమాండ్ సమయంలో పవన్ కల్యాణ్ తెలిపారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వమని పవన్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉమ్మడి కార్యచరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఇరువురిని ఒకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీని తర్వాత ప్రభుత్వంపై పోరాటానికి త్వరలో ఉమ్మడి కార్యచరణను ప్రకటించనున్నారు.

# గురుకుల పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి మేరుగ



అమరావతి, నవంబర్ 4:ఏలూరు జిల్లా చింతలపూడిలో డా.బీఅర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల నూతన భవనాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డా.మేరుగ నాగార్జున ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

లచింతలపూడిలో పన్నెండు కోట్ల రూపాయలతో సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్ నిధులు మంజూరు చేసి త్వరిత గతిన పాఠశాల భవనం నిర్మాణం జరిగేలా ఆదేశాలిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే విఆర్ ఎలిజా, సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

# వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా రెప రెప..??

**– నూతన ఉత్సహంతో ప్రచారంలో వైరా కాంగ్రెస్ శ్రేణులు**
**– ఆదివారం వెలువడే ఆఖరి లిస్ట్ లో వైరా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆంగోతు శ్రీమన్నారాయణ (శివాజీ)**
**– గ్రామ గ్రామాన ఊపందుకున్న ప్రచారం, ఏ నోట విన్నా కాంగ్రెస్.. కాంగ్రెస్**
**– సోషల్ మీడియాలో హోరెత్తుతున్న ఆంగోతు శ్రీమన్నారాయణ (శివాజీ) ప్రచారం**
**– వర్గాలకు అతీతంగా ఉన్న సీనియర్ నాయకుడైన ఆంగోతు శ్రీమన్నారాయణ (శివాజీ) కే టిక్కెట్ ఇవ్వడం కరెక్ట్ అని అందరి అభిప్రాయం**
**– నువ్వా నేనా అన్నట్లు ఢిల్లీలో ప్రధాన అభ్యర్థులు**
**– ఎవరికి వారే ప్రచార రథం సిద్ధం చేసిన వైనం**

ఖమ్మం, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మంజిల్లా వైరా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నేటికీ ఖరారు కాకపోవడంతో కార్యకర్తల్లో ఉత్కంత నెలకొంది. ఇప్పటికే అధిష్టానం రెండు లిస్టులను విడుదల చేసినప్పటికీ పొత్తులో భాగంగా వైరా నియోజక వర్గం వామపక్షాలు కోరుతుండటంతో కాంగ్రెస్ పొత్తు విషయం తేలేవరకు అభ్యర్థి పేరు ఖరారు చేయకపోవడంతో కార్యకర్తల్లో అల జడలు మొదలయ్యాయి. ఇప్పుడు పొత్తు లేదని తెలియడంతో ప్రధాన అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లుగా ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం లో తిష్ట వేసి టికెట్ కోసం పడరాని కష్టాలు పడుతున్నట్లు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల, ఏన్కూర్, జూలూరుపాడు, కారేపల్లి మండలాలలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటికే కాంగ్రెస్ లోకి భారీ స్థాయిలో చేరడంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ప్రధాన అభ్యర్థుల్లో నమ్మకం ఉండటంతో ఎవరు తగ్గేది లేదు అన్నట్లుగా విశ్వప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ ఎన్నికల ఆసన్నమయ్యే కొద్దీ నియోజకవర్గంలో ఉన్న మండలాల్లో కార్యకర్తల్లో ఉత్కంతంగ మారటం కొందరు ప్రధాన అభ్యర్థులు ప్రచారాల రథాలను సైతం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. వైరా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారుతుండటంలో సందేహం లేదు. అందుకే అభ్యర్థులు పోటా పోటీ పడటం జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు. ఏదేమైనా వైరా కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించడంలో అధిష్టానానికి సైతం సవాలుగా మారిందని తెలుస్తుంది. రాహుల్ గాంధీ యాత్ర ముగిశాకే మూడవ లిస్టులో వైరా అభ్యర్థి పేరు ఖరారు చేసే అవకాశం ఉందంటూ సమాచారం, ఇది ఇలా ఉండగా నియోజకవర్గ కార్యకర్తలు మాత్రం వర్గాలకు అతీతంగా, అధిష్టానీ, ఆశీస్సులతో ముందుకొస్తున్న ఆంగోతు శ్రీమన్నారాయణ (శివాజీ) కే ఖచ్చితంగా సీట్ వచ్చే అవకాశం ఉందని చెప్పవచ్చు. ఇదే విషయం నియోజకవర్గంలో చర్చనీయంశంగా మారింది.

# యూఏఈ అధ్యక్షుడుతో మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 4:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు యుఎఇ ప్రెసిడెంట్ హిస్ హైనెస్ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో టెలిఫోన్ లో సంభాషించారు.

పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. తీవ్రవాదం, క్షీణిస్తున్న భద్రతా పరిస్థితి, పౌరుల ప్రాణనష్టం పట్ల ఇరువురు నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు, మానవీయ పరిస్థితులను త్వరగా పునరుద్ధరణ జరగాలని ఇద్దరు నేతలు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరత అనేవే ప్రాముఖ్యత అని అన్నారు. భారతదేశం-యుఎఇ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య చట్రంలో విభిన్న రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడం కొనసాగించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గము ఇండిపెండెంట్ అభ్యర్థిగా మేకల విజయ లక్ష్మి పోటీ

**– నవంబర్ 8 వ తేదిన "నామినేషన్**

శేరిలింగంపల్లి నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );శేరిలింగంపల్లి నియోజకవర్గము ఇండిపెండెంట్ అభ్యర్థిగా మేకల విజయ లక్ష్మి అలియాస్ (వెంకటసుబ్బమ్మ) పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూజైభీమ్ భారతరత్న ,పద్మ విభూషణ్ ,విశ్వ జ్ఞాని , భారత రాజ్యాంగ నిర్మాత "డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ " మనకి ఓటు అనే హక్కు కల్పించాడని, ఆ ఓటును ఉపయోగించుకొని మనం రాజ్యాధికారం కోసము పోరాడి గెలవాలని నినాదంతో తను 2023 అసెంబ్లీ ఎన్నికలలో పోటి చేయడానికి సిద్ధం పడినట్లు తెలిపారు. ఓటుకి నోటు లేదు అనే నినాదంతో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. నా శ్రేయోభిలాషులకు, నా అభిమానులకు, నాకు స్నేహితులకు, నా ఫ్యామిలీ ఫ్రెండ్స్ కి, నా గురువులకు ,నా అక్క, చెల్లెళ్లకు, అన్నలకు తమ్ముళ్లకు, శేరిలింగంపల్లిలో ఉన్న నా ప్రజానీకానికి, యువతి యువకులకు జై భీమ్ లు తెలియజేస్తూ, నేను శేరిలింగంపల్లి నియోజకవర్గానికి ఇండిపెండెంట్ అభ్యర్థి గా నవంబర్ 8 వ తారీఖున 10జీఎ కి "నామినేషన్" వేయబోతున్నదున మీరందరూ తప్పకుండా వచ్చి నన్ను ఆశీర్వదించి, మంచి మెజార్టీతో ఈ ఎలక్షన్లలో నన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. మేకల సుజాత శేరిలింగంపల్లి లో గత 20 సంవత్సురాలుగా నివసిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ తనకంటూ గుర్తింపు పొందారు. పేదలకోసం తాను చేసిన కార్యక్రమాలు తనను గెలిపిస్తాయన్న ధీమాను సుజాత వ్యక్తం చేసారు.

# ధాన్యం ఎంత తెచ్చినా కొనుగోలు చేయాలి- సివిల్ సప్లయిస్ కమిషనర్



విజయనగరం, నవంబరు 4: రైతులు కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని, సివిల్ సప్లయిస్ కమిషర్ హనుమంతు అరుణ్‌కుమార్ ఆదేశించారు. రైతు పూర్తిగా సంతృప్తి చెందేవిధంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో సమీక్షించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితిని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సుమారు 4,63,624 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనిలో స్థానిక అవసరాలు పోనూ, మార్కెట్‌కు సుమారుగా 4,05,200 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, దీనిలో దాదాపు 3,41,000 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో 510 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని, 246 క్లస్టర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబరు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని చెప్పారు.

కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ? లక్ష్యంతో సంబంధం లేకుండా రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు మేలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రైతు సంతృప్తి, సంతోషం మన లక్ష్యాలు కావాలని సూచించారు. మిల్లు సామర్థ్యాన్ని బట్టే లక్ష్యాలు కేటాయించాలని, ఎక్కువ బ్యాంకు గ్యారంటీ ఇచ్చినా, సామర్థ్యం కంటే అదనంగా ధాన్యం కేటాయించవద్దని స్పష్టం చేశారు. ఒక్కో ఆర్‌బీకే కి 10 నుంచి 15 వాహనాలను కేటాయించాలని, ప్రతీ వాహనానికి జీపీఎస్ పరికరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోనె సంచులు, లేబర్ ఖర్చులను రైతులే చెల్లిస్తే, వారికి జమ చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 5 రోజుల్లోనే రైతులకు డబ్బు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో డీఎస్ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం మీనాకుమారి, జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఇతర జిల్లా అధికారులు, సివిల్ సప్లయిస్ డీటీలు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యభిచార గృహంపై దాడి.. 10మంది యువతులు, 8మంది విటులు అరెస్ట్

అమరావతి, నవంబర్ 4:కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోనీ తిరుమల నగర్ లోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు చేశారు. కలకత్తా, బెంగళూరు, హైదరాబాద్, కర్నూల్, ధర్మవరం, తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి గృహ నిర్వాహకులు వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సీఐ నరసింహరావు వెల్లడించారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు 8 మంది విటులను, 10మంది యువతులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి వివరాలు వెల్లడిస్తామ న్నారు.

# ఖమ్మం బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్‌కి పెరుగుతున్న మద్దతు

**– 30కుటుంబాలు మంత్రి పువ్వాడ సమక్షంలోచేరికలు**
**– రఘునాధపాలెం మండలకాంగ్రెస్ అధ్యక్షుడు గ్రామంఖాళీఅయింది**

ఖమ్మం, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ కి రోజు రోజుకు మద్దతు పెరుగుతోంది. రఘునాధపాలెం మండలంలో జరిగిన అభివృద్ధి గడచిన 40ఏళ్లలో ఎప్పుడు జరగలేదని వారు అన్నారు. శివాయిగూడెం గ్రామం నుండి సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, టి.లాలు, బి.నంద, జి.బాలాజీ, బి.రాందాస్, బి.సైదా, ఎం.లాల్ సింగ్, బి.నాగులు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి 30 కుటుంబాలు ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. చేరిన వారిలో వార్డు సభ్యులు బానోత దశరథ్, బానోత దేవి, బాణోత్ వెంకట్ రాం, బాణోత్ ఉదయ్, బాణోత్ రమేశ్, బాణోత్ లాలూ, భూక్యా నాగేశ్వర రావు, బాణోత్ రవి, బాణోత్ వీరన్న, వంకుడోత్ ఉపేందర్, బాణోత్ దేవేందర్, బొడా అచ్చాలి, బానోత్ బద్దు, బానోత్ రాంకోటి, బానోత్ సానా, మూడ్ మంగ్తి, గుగులోత్ విజయ, బానోత్ రాందాస్, బాణోత్ రవి, బాణోత్ సరోజ, బానోత్ ఘూంల్లి పలువురు ఉన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, కాల్వలు, వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వానలు, గ్రామ పంచాయతీ నూతన బిల్డింగ్ లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ త్రాగునీరు ఇలా ప్రజలకు కావాల్సిన అనేక సదుపాయాలు ఎర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పువ్వాడ అజయ్ కుమార్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటా మని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మదినేని వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు వీరునాయక్, పగడాల నాగరాజు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, సర్పంచ్ మెంటెం రామారావు, పిన్ని కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



# మైనార్టీలకు అండగా.. బీఆర్ఎస్ పార్టీ

**–మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 4:మైనారిటీలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ శ్రీకాలనీలో మైనారిటీ నాయకుల సమావేశం, అల్వాల్, ఈస్ట్ ఆనంద్ బాగ్, గౌతంనగర్ డివిజన్‌లలో మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ఇంటింటికి ప్రచారం నిర్వహించి సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మైనారిటీలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పూర్తి రక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుల కోసం రెసిడెన్సియల్ స్కూల్స్‌లో ఉచితంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. ఆడ బిడ్డ పెండ్లికి షాదీ ముబారక్ ? కల్యాణ లక్ష్మి పథకంలో రూ.1,00,116 ఇస్తున్నామని, ఎన్నికల తర్వాత రూ.2,00,116 అందజేస్తామని అన్నారు.

మౌలాలిలో కమ్యూనిటీ హాల్, శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. బీఆంఎస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను విడతల వారీగా అమలు పరుస్తామని అన్నారు. విడతల వారీగా పెన్షన్లు పెంచుతామన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకంలో మహిళలకు నెలనెల రూ.3 వేలు అందజేస్తామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీత రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, సబితా కిశోర్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, మురుగేష్, భాగ్యనంద రావు, ఉస్మాన్, శ్రీనివాస్, ఇబ్రహీం, శైలేందర్, గౌలికర్ దీనేష్, జగదీష్, సంతోష్ గుప్త, ఆది నారాయణ, సాదిక్, నర్సింగరావు, తోట నాగేష్, నవాబ్, శ్రీనివాస్ రెడ్డి, సాబిర్, ప్రవీణ్ గౌడ్, గణేష్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల అధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల ప్రచారం



ఖమ్మం, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కె.వి. కృష్ణ రావు నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం కోసం ఖమ్మం అభివృద్ధి ప్రదాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శనివారం రాపర్తి నగర్ బీసి కాలనీ, వివేకానంద కాలనీలలో గడపగడపకు ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల కరపత్రాన్ని పంచుతో వాటి గురించి డివిజన్లోని అందరికీ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జిల్లా కన్వీనర్ బచ్చాల పద్మాచారి, ఉద్యమకారులు షేక్ మస్తాన్, బట్టు రాజేందర్, దాసరి శ్రీనివాస్, సాయి, ప్రణయ్, కామ ప్రభకర్, నరసింహారావు తదితరులున్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు.. ఏపీ కేబినెట్ ఓకే

అమరావతి, నవంబర్ 4: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అక్రిడేటెడ్ జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి అంగీకారం తెలిపింది. సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రిమండలి సభ్యులు పలువురు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని కలుసుకుని హర్షామోదం తెలిపారు.

సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాల నాయుడు, కే నారాయణస్వామి, అంజాద్‌బాషా, హోంమంత్రి తానేటి వనిత, పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, గృహనిర్మాణ మంత్రి జోగి రమేష్, కేవీ ఉషశ్రీచరణ్ తదితరులు సీఎం జగన్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

# ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

## -పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



హైదరాబాద్, నవంబర్ 4:నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో క్షేత్ర స్థాయిలో పోలీస్ సిబ్బంది తీసుకోవాల్సిన బందోబస్తు జాగ్రత్తలపై శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సిబ్బందికి ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌ఐలు, ?ఫ్లైయింగ్ స్కాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ ఇతర సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను తమ కిందిస్థాయి సిబ్బందికి అందించాలని, క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే కిందిస్థాయి సిబ్బందికి కూడా ఎన్నికల నిబంధనల మీద పరిజ్ఞానం, అవగాహన కల్పించడానికి ఆయా సిబ్బందితో అంతర్గత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని అధికారులకు ఆదేశించారు.

అవసరమైన చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలిస్తున్న డబ్బు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయా రాజకీయ పార్టీలు తరలించే సామాగ్రిని అడ్డుకోవాలన్నారు. పరిమితికి మించిన అక్రమ నగదును ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేయాలని సూచించారు. అత్యవసరంగా ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను ముందుగానే చూసుకోవాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని, శాంతి భద్రతల సమస్యలను సృష్టించేందుకు అవకాశమున్న సోషల్ మీడియా సందేహాలు, వీడియోలు వైరల్ చేసే అవకాశాలుంటాయని, ఉన్నతాధికారులకు ఇలాంటి విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు సీపీ తరుణ్ జోషీ, డీసీపీలు దరావత్ జానకి, ఇందిరా, అదనపు డీసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

### మేడ్చల్ ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం: కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకుల అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ శుక్రవారం వెల్లడించారు. శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా నియమించినట్లు పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గానికి అబ్జర్వర్లు(పరిశీలకులు) ఎస్.కె.జైన్, మల్కాజిగిరి, ఉప్పల్‌లకు పూర్వాగార్గ్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు అమన్ మిట్టల్‌లను నియమించగా, వ్యయ పరిశీలకులుగా మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్‌లకు ప్రేమ్ ప్రకాశ్ మీనా, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు నాగ్వే బాలాసాహెబ్ బాపూరావుల నియమించినట్లు కలెక్టర్ గౌతమ్ వివరించారు.

# బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



మహబూబాబాద్, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండలంలోని అవుతాపురం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తోటకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఆరు కులాల నుండి సుమారు 100 కుటుంబాలు పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగింది. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. గౌడ సంఘం నుండి మాజీ అధ్యక్షుడు కమ్మగాని ఐలయ్య, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎండీ హోలీ పాష,కుమ్మరి సంఘం అధ్యక్షుడు పాలబిందల సంపత్, గొల్ల కురుమల నుండి రాసాల ఐలయ్య, రాసాల మల్లయ్య ,బొమ్మరబొయిన ఐలయ్యతోపాటు 47 గొల్ల కురుమలు కుటుంబాలు మరియు బొల్లోజు సోమచెంద్రం పార్టీలోకి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మరబోయిన రవి ఉపాధ్యక్షుడు బొమ్మరబోయిన ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చాట్ల లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గద్దల స్వామి, మహిళా అధ్యక్షురాలు బొమ్మరబోయిన రేణుక, ఉపాధ్యక్షురాలు గద్దల పద్మ,, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమాచారి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాశోజు నరసింహచారి, సలిదండి వీరేష్ , కొండం సంపత్ రెడ్డి,గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మాయిగూడలో డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్, నవంబర్ 4:వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న స్కూటీని పట్టుకుని తనిఖీ చేయగా 50 గ్రాముల డ్రగ్స్ లభ్యమయ్యాయి. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన ప్రకారం, కుమావత్ చిల్లారం, మోహన్‌లాల్ చౌదరి బాలాజీనగర్‌లో వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. సులభంగా డబ్బులు సంపాదించటానికి అలవాటు పడుతూ రాజస్థాన్ నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ తీసుకువచ్చి తెలంగాణలో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా, నిందితులు పట్టుబడ్డారు. 50 గ్రాముల ఓపీఎం డ్రగ్స్, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# బండారికే.. మా మద్దతు

## -ముస్లిం సోదరుల తీర్మానం

హైదరాబాద్, నవంబర్ 4: ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక స్థానం కల్పిస్తున్నదని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని జమా మసీదు వద్ద ముస్లిం సోదరులు, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్యతో కలిసి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు తమ మద్దతు తెలుపుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బద్రుద్దీన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్, ఎండీ. అలీమొద్దీన్, నిసార్ అహ్మద్ ఘోరీ, షకీల్ ఉజ్ జమా, ఎండీ. సలీముద్దీన్, మసూద్ భాయ్, ఖలీమ్, మజీబ్, బీఆర్ఎస్ నాయకులు మధు ముదిరాజ్, రహీం భాయ్, ఇక్బాల్, సాయి కుమార్, నవీన్ గౌడ్, జంపాల్‌రెడ్డి, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా లండన్‌లో ప్రచారం చేపట్టారు. ఈమేరకు లండన్‌లోని ఉప్పల్ నియోజకవర్గ ఓటర్లు బండారి లక్ష్మారెడ్డికి ఓటు వేయాలని కోరారు. నాచారానికి చెందిన సందీప్‌రెడ్డి శుక్రవారం లండన్ బ్రిడ్జి వద్ద ప్లకార్డులతో ప్రచారం చేపట్టారు. లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

# జర్నలిజం కుటుంబాలకు ఉచితంగా విద్య, వైద్యం, వసతిలాంటి మౌలిక సదుపాయాలు

## -జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ డిమాండ్

విశాఖపట్నం నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);భారతదేశంలో ఇప్పటి వరకు నాలుగు రకాల వ్యవస్థ ముందుకు వెళ్లిందని వాటిలో 1 రాజరికం 2 రౌడీయిజం 3 రాజకీయం 4 ప్రస్తుతం మీడియా ఇజం నడుస్తుందని పై మూడు నడిచిన వాటిల్లో ఎక్కువ శాతం వ్యక్తులే బాగుపడ్డారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ డిమాండ్ పేర్కొన్నారు.కానీ మీడియా ఇజం వచ్చిన తర్వాత వ్యవస్థలో సామానుడు అండకీ గొంతుకగా మీడియా విజన్ నడుస్తుందని ఈ పరిస్థితుల్లో ప్రజాసంఘాలు ఎప్పటినుంచో నిజమైన ప్రజాస్వామ్యం బతకాలంటే కేవలం జర్నలిజం వలనే సాధ్యమని జర్నలిజం కుటుంబాలకి సదుపాయాలు ఉచితంగా విద్య వైద్యం వసతి లాంటి మౌలిక సదుపాయాలు కేటాయించాలని డిమాండ్ చేసారు. సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించామంటూ అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం క్యాబినెట్లో తీర్మానం చేసి అనేక సంఘాల వాళ్ళ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి బంధువులు వడ్డీ వ్యాపారు దగ్గర నుంచి డబ్బులు తీసుకొచ్చి ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయని కొంతమంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి బెయిల్ వచ్చిన సందర్భంగా జరిగిన ఊరేగింపు ప్రజల్లో నుంచి దృష్టి మరల చదవడానికి ఈ రకమైనటువంటి జర్నలిస్టులకు ఇల్లు స్థలాలు అంటూ చెరపైకి తీసుకువచ్చారని మాట్లాడటం సరికాదని ప్రస్తుతం ఈ పథకంలో ఇచ్చే మూడు సెంట్లు స్థలం వల్ల అన్ని పత్రికల్లో పని చేసేవాళ్లు అనగా ఈనాడు ఆంధ్రజ్యోతి టీవీ 5 సహా ఐదు సంవత్సరాల దాటిన ప్రతివారికి ఈ పథకం వర్తిస్తుందంటూ ప్రకటన చేయడం పట్ల ముఖ్యమంత్రి శివాయ జగన్మోహన్ రెడ్డి గారి నిర్ణయం పట్లహర్షం వ్యక్తం చేశారు సంక్రాంతి కల్లా విలేకరులకు స్థలాలు ఇస్తే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిని 175 నియోజకవర్గాలు కళాకారులు ప్రజాసంఘాల నేతలతో కలిసి రథయాత్ర చేసి సంక్షేమ పథకాలు ప్రచారం చేసి గెలిపిస్తామంటూ కర్రి వేణుమాధవ్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మడ అడవుల విస్తీర్ణం పెంపుకు అటవీశాఖ కసరత్తు

అమరావతి, నవంబర్ 4:మడ అడవులు.. పర్యావరణకు ప్రకృతి ప్రసాదించే వరాలు. తీర ప్రాంతాలకు రక్షణ గోడలు. సముద్ర తీర జీవవైవిధ్యంలో వీటి దే కీలక పాత్ర. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి మనుషుల్ని, వన్య ప్రాణుల్ని కాపాడుతున్నాయి. లక్షలాది మంది జీవనోపాధికి అసరాగా నిలుస్తున్నాయి. సముద్ర తీర ప్రాంతంలో జీవ మనుగడ, పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు ఈ మడ అడవులు ఎంతగానో దోహదపడతాయి. నదీ ముఖద్వారాల వద్ద.. సముద్ర ఆటుపోట్లకు గురయ్యే ప్రదేశాల్లో పెరిగే ప్రత్యేక జాతికి చెందిన మొక్కలను మడ అంటారు.

వందలాది ఎకరాల్లో దట్టంగా అల్లుకుపోయే వీటి సమూహాన్ని మడ అడవులుగా పిలుస్తారు. ఇవి ఉప్పు నీటిని తట్టుకుంటాయి. పోటు సమయంలో నీట మునిగినా చచ్చిపోవు. కొన్ని మొక్కల ఆకుల్లో ఉప్పును ప్రవించే గ్రంథులుంటాయి. వీటి వేర్లు ఉప్పు నీటిని వడపోసి మంచినీటిగా మార్చుకుంటాయి. మడ చెట్లు ముఖ్యంగా మత్స్య సంపద పెరగటానికి, సముద్ర కోతను అరికట్టడానికి, తుఫాన్లు, సునామీల తీవ్రత నుంచి తీర గ్రామాలను రక్షించటానికి ఉపయోగపడతాయి.

ప్రపంచంలోనే అత్యంత వైవిధ్యం కలిగిన మడ అడవులు తీర ప్రాంత ప్రజలను కాపాడే సహజసిద్ధ కవచాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 113 దేశాల్లో 1.4 కోట్ల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో మడ అడవులున్నాయి. ఇందులో 50 లక్షల హెక్టార్లకు పైగా ఆసియా ఖండంలోనే ఉండటం గమనార్హం. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదుల సముద్రంలో కలిసే ప్రాంతాల్లో ఎక్కువగా మడ అడవులు ఉన్నాయి. గోదావరి తీరంలో కాకినాడ, బీఆర్ అంబేద్కర్ జిల్లాలు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో ఇవి విస్తరించాయి.

ఇవి కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ కొద్దిమేర మడ అడవులు ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రపంచ వ్యాప్తంగా మడ అడవులు తగ్గుతుండటంతో, రాష్ట్రంలో ఈ అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు అటవీశాఖ కొన్నేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా బంగాళాఖాతం తీర ప్రాంతాన్ని ఆనుకుని తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు సమీపంలోని కోరంగిలో ఉన్న మడ అడవులకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

ముఖ్యంగా సముద్ర తీరం కోతకు గురి కాకుండా కాపాడటంలోను, ఎన్నో రకాల జలచరాలకు ఆశ్రయం ఇవ్వడంలోను మడ అడవులది ప్రత్యేక స్థానం. ఇటీవల పర్యటకంగానూ మడ అడవులు ప్రసిద్ధి పొందాయి. ఇక్కడ 187.81 చదరపు కిలోమీటర్ల మేర ఉండగా, ఆ తర్వాత కృష్ణా అభయారణ్యంలో 137.76 చదరపు కిలోమీటర్లలో ఈ అడవులు వ్యాపింవున్నాయి. కోరింగ మడ అడవుల్లో 34 రకాల మొక్కలు ఉన్నట్లు అంచనా. నీటికాకి, కొంగ, నారాయణ పక్షులు, ఉల్లంపిట్టలు, బాతులు, సముద్రపు చిలకలు.

ఇలా ఉభయచరాలు, పక్షులు, క్షీరజాతులు మొత్తం 119 రకాల జీవజాలం ఈ మడ అడవుల్లో నివసిస్తున్నాయని అక్కడివారు చెబుతున్నారు. పొన్న, నల్లమడ, కళింగ, గుగ్గిలం మొదలైనటువంటి మడ జాతి మొక్కలతో దట్టమైన వృక్షసంపదతో పాటు, చేపలు పట్టు పిల్లి, నీటికుక్క, నక్క వంటి జంతు సంపద ఇక్కడ కనిపిస్తాయి. నీటి పిల్లా (మరకపల్లి, ఏటిపిల్లి) అనే వన్య ప్రాణితో పాటు అనేక జంతువులు, పక్షులకు ఆవాసంగా నిలుస్తున్నాయి. విదేశీ పక్షులకూ విడిది కేంద్రంగా ఆకర్షిస్తున్నాయి. అంతే కాదు కృష్ణాజిల్లాలోని నాగాయలంక మండలం పరిధిలోని పలు తీర ప్రాంత గ్రామాల్లో విస్తరించిన మడ అడవులు అరుదైన జంతువులు, పక్షలకు అవాసంగా మారాయి.

దేశంలోనే అరుదుగా కనిపించే పిషింగ్ క్యాట్ (బావురుపల్లి) ఈ ప్రాంతంలోనే ఎక్కువగా కనిపిస్తుంటాయి. నీటి కుక్కలు, అరుదైన సముద్రపు తాబేళ్లు, పెలికాన్ (గూడబాతు), కింగ్ ఫిషర్స్ పక్షులు తదితర పక్షిజాతులు ఈ ప్రాంతంలో సందడి చేస్తుంటాయి. 2021 ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం దేశంలోనే అటవీ విస్తీర్ణంలో గరిష్ట పెరుగుదలను నవోదు చేసిన రాష్ట్రాల్లో 647 చదరపు కిలోమీటర్ల వృద్ధిరేటు ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో నిలిచింది. 632 చదరపు కిలోమీటర్ల వృద్ధితో తెలంగాణ రెండో స్థానంలో ఉండగా, 537 చ.కి.మీ వృద్ధితో ఒడిశా మూడో స్థానంలో ఉంది.

నదీ తీర ప్రాంతాలతో పాటు నదులు సముద్రంలో కలిసే భూభాగంలో మొక్కలు నాటడం ద్వారా విస్తీర్ణం పెరుగుతోంది. మడ అడవులు పెంచేందుకు అనువైన ప్రాంతాలన్నీంటినీ సమర్థంగా ఉపయోగించుకునేందుకు అటవీశాఖ ప్రణాళికలు రూపొందించింది. సముద్ర జలాలు చొచ్చుకుని వచ్చే ప్రాంతాలల్లో వీటిని పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. చిత్తడి నేలలో పెరిగే ఈ చెట్ల వేర్ల వ్యవస్థ భిన్నంగా ఉంటుంది. మామూలు నేలలో పెరిగే చెట్ల వేర్లు భూమి లోపలికి పెరుగుతాయి. కానీ ఇక్కడ నేలలు నిరంతరం నీటిలో మునిగి ఉంటాయి.

కాబట్టి, భూమిలోకి ఉండే వేర్ల వల్ల ఈ చెట్లకు కావాలిసినంత ఆక్సిజన్ తీసుకునే అవకాశం తక్కువ. అందువల్ల మడ అడవులలో పెరిగే మొక్కల వేర్లు భూమిపైకి కనబడతాయి. వీటి నుంచి కొత్త మొక్కలు రావడం వల్ల ఇక్కడ చెట్లు దట్టంగా గుబురుగా పెరుగుతాయి. ఇలాంటి చిత్తడి అడవులు కేవలం నదీసాగర సంగమ ప్రదేశాలలో ఏర్పడ్డ బురద నేలల్లోనే కనిపిస్తాయి. గంగానది తీర ప్రాంతం పశ్చిమ బెంగాల్లోని సుందరవనాలు మన దేశంలో అతిపెద్ద మడ అడవులైతే.. రెండోది గోదావరి తీరంలోని ఈ కోరంగి మడ అడవులు కావడం గమనార్హం.

మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచండి : సీఎస్

రాష్ట్రంలో మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అటవీశాఖ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల క్రితం కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కాంపా) 20వ స్టీరింగ్ కమిటీ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిన విషయం విధితమే. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మడ అడవులు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని సూచించారు. తీర ప్రాంత జిల్లాల్లో అవకాశం ఉన్నచోట్ల మడ అడవుల పెంపకానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# పేదల అభ్యున్నతే కేసీఆర్.. పీజేఆర్‌ల లక్ష్యం

## -జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్..

హైదరాబాద్, నవంబర్ 4:నగర అభివృద్ధికి నాడు పీజేఆర్ చేసిన సేవలకు దీటుగా నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులతో, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఐదు దశాబ్దాలు సేవ చేసిన కుటుంబానికి టికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేశారంటే, ఆ పార్టీ ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమైనా.. తన తండ్రి పీజేఆర్ ఆశయ సాధనైనా ఒక్కటే.. కాబట్టి నేడు పీవీఆర్ బీఆర్ఎస్ పార్టీలోకి అడుగు పెట్టారన్నారు.తన తండ్రి కోరుకున్న విధంగా పేదలను, అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తున్న సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పీవీఆర్ గుర్తించబట్టే నేడు బీఆర్ఎస్ పార్టీతో మమేకమయ్యేందుకు సిద్ధమయ్యాడని అన్నారు. తనకంటే వయసులో చిన్నవాడైనా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా తన కంటే సీనియర్ అని, విష్ణు తన సోదర సమానుడని అన్నారు. అనంతరం, విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి 52 ఏండ్లు సేవ చేసిన పీజేఆర్ కుటుంబానికి టికెట్ ఇచ్చేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారంటే అంతకన్నా అవమానం మరొకటి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే నేడు రాష్ట్రాన్ని అమ్ముకునే దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నారని అన్నారు.

హైదరాబాద్ నగరానికి పీజేఆర్ చేసిన సేవలను గుర్తించి కొడిగట్టిన దీపం లాంటి నా రాజకీయ జీవితాన్ని సీఎం కేసీఆర్ తిరిగి నిలబెట్టారని అన్నారు. పీజేఆర్ కుటుంబానికి అవమానం చేసిన కాంగ్రెస్‌కు పీజేఆర్ అభిమానులు, ఆత్మీయులు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ ఎన్నికలలో మాగంటి గోపీనాథ్‌ది కాదని, గతంలో నాకు వచ్చిన 56 వేల పీజేఆర్ అభిమానుల ఓట్లతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థిని బంపర్ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదల కోసం కష్టపడి పనిచేయడం తన తండ్రి నుంచి అలవడిందని.. ఇకపై బీఆర్ఎస్ పార్టీలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పీజేఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ కట్టెల శ్రీనివాస్ యాదవ్, మైనార్టీ రాష్ట్ర నేత సొహైల్, కార్పొరేటర్లు రాజ్ కుమార్ పటేల్, దేదీప్య రావు, సీఎన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ అధికారంలోకొస్తే బండి సంజయ్ సీఎం.. మానప్ప ఒజ్జల్



హైదరాబాద్, నవంబర్ 4:తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బండి సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యే అర్హత, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కర్నాటక లింగసుగుర్ శాసనసభ్యులు, కరీంనగర్ ఎన్నికల ఇంఛార్జీ మానప్ప ఒజ్జల్ తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా గెలవబోయే అసెంబ్లీ నియోజకవర్గాల్లో కరీంనగర్ అసెంబ్లీ మొదటి స్థానంలో ఉందన్నారు. మెజారిటీ ఎంత వస్తుందనే దానిపైనే ఆసక్తిగా ఎదురు చూస్తున్నామన్నారు. ఈ మేరకు తమకు నివేదికలు అందాయన్నారు. ఈరోజు జూబ్లీనగర్‌లో జరిగిన కరీంనగర్ రూరల్ మండల నాయకులు, పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశంలో మానప్ప ఒజ్జల్ మాట్లాడుతూ బండి సంజయ్ హార్డ్ వర్క్, కరీంనగర్ కార్యకర్తల కష్టపడే తత్వం వల్లే గెలుపు ఈజీగా మారిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బండి సంజయ్ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నాయకుడే సీఎం అవుతారని హైకమాండ్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో బండి సంజయ్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బండి సంజయ్ ను కనీవినీ ఎరగని రీతిలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నానన్నారు. అనంతరం కర్నాటక ఎమ్మెల్సీ, ఎన్నికల జోనల్ ఇంఛార్జీ కేశవప్రసాద్ మాట్లాడుతూ? బండి సంజయ్ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారన్నారు. తెలంగాణ అంతటా ప్రచారం చేయాలన్నారు. కాబట్టి ఇకపై మీ బూత్ లో మీరే బండి సంజయ్. మీరే ఇంటింటికీ తిరిగి అత్యధిక ప్రచారంతో గెలిపించాలని కోరారు. కర్నాటకలో మాజీ ముఖ్యమంత్రి యుడ్యూరప్ప ఎన్నికల సమయంలో తన అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకేసారి వెళ్లి నామినేషన్ వేస్తారన్నారు. ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. పోలింగ్ బూత్ సభ్యులే ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి యడ్యూరప్పను గెలిపిస్తారన్నారు. అందువల్లే యడ్యూరప్ప కర్నాటకలో 4సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. తెలంగాణలోనూ బండి సంజయ్ కు అత్యంత ప్రజాదరణ ఉన్న నేపథ్యంలో బండి సంజయ్ ను లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నట్లు తెలిపారు.

# ఈనెల 5న బీసీ విస్తృతస్థాయి రాష్ట్ర సమావేశం

## - బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల భవిష్యత్ రాజకీయ కార్యాచరణ పై చర్చించి.. బిసిల రాజకీయ విధానం ప్రకటించడానికి ఈనెల 5వ తేదిన హైదరాబాదులోని సెంట్రల్ కోర్టు హోటల్ లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుజాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు జనాబ దామాషా ప్రకారం 60 అసెంబ్లీ స్థానాలను, బీసీలకు ముఖ్యమంత్రి పదవి కావాలనే ప్రధాన డిమాండ్ తో బీసీలు రాజకీయ పోరాటం చేస్తున్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రకులాలకే రాజకీయ ప్రాధాన్యత కల్పించి, బీసీలను రాజకీయంగా అణిచివేయాలని చూస్తున్నాయని ఆయన అన్నారు. ఇప్పటివరకు ప్రకటించిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల్లో బీసీలకు తిరని అన్యాయం జరుగుతుందన్నారు,ఇలాంటి నేపథ్యంలో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు అనుసరించవలసిన రాజకీయ విధి,విధానాలపై రాష్ట్ర సమావేశంలో విస్తృతంగా చర్చించి భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ఖరారు చేయడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# వరల్డ్ ఫూడ్ ఇండియా 2023 ను ప్రారంభించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 4:'వరల్డ్ ఫూడ్ ఇండియా 2023' అనే ఆహార సంబంధి పెద్ద కార్యక్రమం యొక్క రెండో ఎడిశన్ ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూ ఢిల్లీ లోని ప్రగతి మైదాన్ లో ఉన్న భారత్ మండపమ్ లో ఈ రోజు న ప్రారంభించారు. స్వయం సహాయ సమూహాల (ఎస్ హెచ్ జిస్)ను బలపరచడం కోసం ఉద్దేశించినటువంటి సీడ్ కేపిటల్ అసిస్టెన్స్ ను ఒక లక్ష మంది కి పైగా ఎస్ హెచ్ జి సభ్యుల కు ఆయన అందజేశారు. ఈ సందర్భం లో ఏర్పాటైన ఒక ప్రదర్శన ను కూడా ఆయన సందర్శించారు. భారతదేశాన్ని ప్రపంచాని కి ఆహార గంప గా చాటి చెప్పడం తో పాటు 'శ్రీ అన్న యొక్క అంతర్జాతీయ సంవత్సరం' గా 2023 వ సంవత్సరాన్ని పాటించడం కూడా ఈ కార్యక్రమం యొక్క లక్ష్యాల లో భాగాలు గా ఉన్నాయి.

జనసమూహాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఈ సందర్భం లో ఏర్పాటైన టెక్నాలజీ ఎండ్ స్టార్ట్ అప్ పెవిలియన్ ను మరియు ఫూడ్ స్ట్రీట్ ను ప్రశంసించారు. రుచి మరియు సాంకేతిక విజ్ఞ?నం ల మేళనం భవిష్యత్తు కాలానికి చెందిన ఆర్థిక వ్యవస్థ కు బాట ను పరచగలుగుతుందని కూడా ప్రధాన మంత్రి అన్నారు. మార్పుల కు లోనవుతున్నటువంటి వర్తమాన ప్రపంచం లో, ఆహార భద్రత కు సంబంధించిన ప్రధానమైన సవాళ్ల లో ఒక ప్రధానమైన సవాలు ను గురించి మరియు వరల్డ్ ఫూడ్ ఇండియా 2023 కు ఉన్న ప్రాముఖ్యాన్ని గురించి ప్రముఖం గా పేర్కొన్నారు.

'చక్కని అవకాశాల ను ప్రసాదించే రంగం' గా భారతదేశం యొక్క ఫూడ్ ప్రాసెసింగ్ సెక్టర్ ను గుర్తిస్తూ ఉండడం అనేది వరల్డ్ ఫూడ్ ఇండియా యొక్క ఫలితాల కు ఒక పెద్ద ఉదాహరణ అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. గడచిన తొమ్మిది సంవత్సరాలలో, ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి పరిశ్రమ కు అనుకూలమైన విధానాలు మరియు రైతు లకు అనుకూలమైన విధానాల పర్యవసానం గా ఈ రంగం ఏభై వేల కోట్ల రూపాయల కు పైగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్ డిఐ) ని ఆకట్టుకొందన్నారు. ఫూడ్ ప్రాసెసింగ్ రంగం లో ఉత్పాదన తో ముడిపెట్టినటువంటి ప్రోత్సాహకం (పిఎల్ఐ) పథకాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించి, అది పరిశ్రమ లో క్రొత్త పాత్రదారుల కు పెద్ద సహాయాన్ని సమకూరుస్తోంది అన్నారు. సుమారు గా ఏభై వేల కోట్ల రూపాయల కు పైగా పెట్టుబడి తో కూడిన ఎగ్రి-ఇన్ ఫ్రా ఫండ్ ఫార్ పోస్ట్-హార్వెస్ట్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లో భాగం గా, వేల కొద్దీ ప్రాజెక్టు ల పనులు జరుగుతున్నాయి, అలాగే పశు పోషణ మరియు చేపల పెంపకం రంగం లో వేల కొద్దీ కోట్ల రూపాయల విలువైన పెట్టుబడి తో ప్రాసెసింగ్ సంబంధి మౌలిక సదుపాయాల కల్పన ను ప్రోత్సహించడం కూడ జరుగుతోంది అని ఆయన వివరించారు.

''ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారు మిత్రపూర్వక విధానాలు ఆహార రంగాన్ని నూతన శిఖరాల కు చేర్చుతున్నాయి'' అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. గడచిన తొమ్మిది సంవత్సరాల లో భారతదేశం యొక్క వ్యావసాయక ఎగుమతుల లో శుద్ధి చేసిన ఆహారం యొక్క వాటా 13 శాతం నుండి 23 శాతాని కి వృద్ధి చెందింది అని ప్రధాన మంత్రి తెలిపారు; దీనితో ప్రాసెస్డ్ ఫూడ్స్ ఎగుమతుల లో మొత్తం మీద చూస్తే 150 శాతం వృద్ధి చోటు చేసుకొందన్నారు. ''ప్రస్తుతం భారతదేశం వ్యావసాయక ఉత్పత్తి పరం గా చూసినప్పుడు 50,000 మిలియన్ యుఎస్ డాలర్ కు పైచిలుకు సమగ్రమైన ఎగుమతి సంబంధి విలువ తో ఏడో స్థానం లో ఉంది'' అని ఆయన వెల్లడించారు. భారతదేశం ఫూడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ లో ఇదివరకు ఎరుగనంత వృద్ధి ని నమోదు చేయని రంగం అంటూ ఏదీ లేదు అని ఆయన స్పష్టం చేశారు. ఫూడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ తో అనుబంధం కలిగి ఉన్న ప్రతి ఒక్క కంపెనీ కి మరియు స్టార్ట్-అప్ కు ఇది ఒక సువర్ణావకాశం అని ఆయన అన్నారు.

భారతదేశం లో ఫూడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ శరవేగం గా వృద్ధి చెందుతూ ఉన్నందుకు ఖ్యాతి ప్రభుత్వం చేపడుతున్నటువంటి నిరంతర ప్రయాసలు మరియు సమర్పణ భావం తో కూడిన ప్రయాసలదే అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం లో మొట్టమొదటి సారి ఎగ్రి-ఎక్స్ పోర్ట్ పాలిసి కి రూపకల్పన చేయడం, జాతీయ స్థాయి లో లాజిస్టిక్స్ మరియు ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లను అభివృద్ధి చేయడం, జిల్లా ను గ్లోబల్ మార్కెట్ తో సంధానించేందుకు వంద కు పైగా జిల్లా స్థాయి కేంద్రాల ను ఏర్పాటు చేయడం, మెగా ఫూడ్ పార్క్ లను రెండు నుండి ఇరవై కి పైచిలుకు స్థాయి కి పెంచడం తో పాటు భారతదేశం యొక్క ఫూడ్ ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని 12 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 200 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు స్థాయి కి చేర్చడం వంటి అంశాల ను గురించి ఆయన ప్రస్తావించారు. భారతదేశం లో ఫూడ్ ప్రాసెసింగ్ సామర్థ్యం గడచిన తొమ్మిది ఏళ్ళ లో 15 రెట్ల వృద్ధి ని చూసింది అని ఆయన అన్నారు. భారతదేశం నుండి మొట్టమొదటి సారి గా ఎగుమతి అవుతున్న వ్యావసాయక ఉత్పాదన లతాలూకు ఉదాహరణల ను కొన్నింటిని ప్రధాన మంత్రి ఈ సందర్భం లో ప్రస్తావించారు. ఆయన హిమాచల్ ప్రదేశ్ నుండి నల్ల వెల్లుల్లి, జమ్ము ఉ కశ్మీర్ నుండి డ్రాగన్ ఫ్రూట్, మధ్య ప్రదేశ్ నుండి సోయా పాల పొడి, లద్దాఖ్ నుండి కర్ చీఛూ రకం ఆపిల్స్, పంజాబ్ నుండి కేవెండిశ్ రకం అరటి, జమ్ము నుండి గుచ్ఛీ రకం పుట్టగొడుగులు మరియు కర్నాటక నుండి ముడి తేనె లను గురించి చెప్పారు.

భారతదేశంలో వేగవంతమైన పట్టణీకరణ నేపథ్యంలో రైతులు, అంకుర సంస్థలు, చిన్న పారిశ్రామికవేత్తలకు ఇప్పటివరకు అన్వేషించని అవకాశాలను కల్పించేలా ప్యాకేజ్డ్ ఫుడ్‌కు పెరుగుతున్న డిమాండ్‌పై ప్రధానమంత్రి ఆలోచనలు పంచుకున్నారు. ఈ అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోవడానికి ప్రతిష్టాత్మకమైన ప్రణాళిక అవసరమని శ్రీ మోదీ నొక్కి చెప్పారు.

ఆహార శుద్ధి రంగంలో భారతదేశం వృద్ధి ప్రస్థానానికి మూడు ప్రధాన స్తంభాలు - చిన్న రైతులు, చిన్న పరిశ్రమలు మరియు మహిళలు అని ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. చిన్న రైతుల భాగస్వామ్యాన్ని, వారి లాభాలను పెంచడానికి ఒక వేదికగా రైతు ఉత్పత్తి సంస్థలు లేదా ఎఫ్‌పిఓలను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని ఆయన ప్రధానంగా పేర్కొన్నారు. "మనం భారతదేశంలో 10 వేల కొత్త ఎఫ్‌పిఓలను ఏర్పాటు చేస్తున్నాము. వాటిలో 7 వేలు ఇప్పటికే సిద్ధమయ్యాయి'' అని ఆయన తెలియజేశారు. రైతులకు మార్కెట్ సదుపాయం, ప్రాసెసింగ్ సౌకర్యాల లభ్యత పెరగడాన్ని ఆయన ప్రస్తావించారు. చిన్న తరహా పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో సుమారు 2 లక్షల సూక్ష్మ పరిశ్రమలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. "ఒక జిల్లా ఒక ఉత్పత్తి"- ఓడీఓపి వంటి పథకాలు చిన్న రైతులు, చిన్న పరిశ్రమలకు కూడా కొత్త గుర్తింపును అందిస్తున్నాయి" అని ఆయన అన్నారు.

భారతదేశంలో మహిళల సారథ్యంలోని అభివృద్ధి పథం వెలుగులతో నిండడాన్ని ప్రధానమంత్రి చెబుతూ... ఆర్థిక వ్యవస్థకు పెరుగుతున్న మహిళల సహకారాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. తద్వారా ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమకు ప్రయోజనం చేకూరుతుంది. భారతదేశంలో 9 కోట్ల మందికి పైగా మహిళలు నేడు స్వయం సహాయక సంఘాలతో అనుబంధం కలిగి ఉన్నారని ఆయన తెలియజేశారు. భారతదేశంలో వేలాది సంవత్సరాలుగా మహిళలు ఆహార శాస్త్రంలో అగ్రగామిగా ఉన్నారని నొక్కిచెప్పిన ప్రధాన మంత్రి, భారతదేశంలో ఆహార వైవిధ్యం, ఆహారపు రకాలు భారతీయ మహిళల నైపుణ్యాలు, జ్ఞానం ఫలితమని అన్నారు. ఊరగాయలు, పాపడ్‌లు, చిప్స్, మురబ్బా వంటి అనేక ఉత్పత్తుల మార్కెట్‌ను మహిళలు తమ ఇళ్ల నుంచే నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ''ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు నాయకత్వం వహించే సహజ సామర్థ్యం భారతీయ మహిళలకు ఉంది'', మహిళల కోసం ప్రతి స్థాయిలో కుటీర పరిశ్రమలు, స్వయం సహాయక బృందాలను ప్రోత్సహిస్తున్నట్లు శ్రీ మోదీ తెలియజేసారు. ఈ కార్యక్రమం సందర్భంగా లక్ష మందికి పైగా మహిళలకు కోటి రూపాయల విలువైన సీడ్ క్యాపిటల్‌ను పంపిణీ చేయడాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు.

''భారతదేశంలో సాంస్కృతిక వైవిధ్యం ఎంత ఉందో అంతే ఆహార వైవిధ్యం ఉంది. భారతదేశ ఆహార వైవిధ్యం ప్రపంచంలోని ప్రతి పెట్టుబడిదారునికి డివిడెండ్‌గా నిలుస్తుంది'' అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. భారతదేశం పట్ల ఉత్సుకత పెరగడాన్ని గమనించిన ప్రధాన మంత్రి, భారతదేశ ఆహార సంప్రదాయాల నుండి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆహార పరిశ్రమ చాలా నేర్చుకోవాలని ఉద్ఘాటించారు. భారతదేశ సుస్థిర ఆహార సంస్కృతి వేల సంవత్సరాల అభివృద్ధి ప్రయాణం ఫలితమని ఆయన అన్నారు. వేల సంవత్సరాలలో భారతదేశ స్థిరమైన ఆహార సంస్కృతి పరిణామంపై మాట్లాడుతూ, భారతదేశ పూర్వీకులు ఆహారపు అలవాట్లను ఆయుర్వేదంతో అనుసంధానించారని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. ''ఆయుర్వేదంలో, 'రీతా-భుక్' అని చెప్పబడింది, అంటే సీజన్ ప్రకారం తినడం, 'మిత భుక్' అంటే సమతుల్య ఆహారం, 'హిత భుక్' అంటే ఆరోగ్యకరమైన ఆహారాలు, ఇవి భారతదేశ శాస్త్రీయ అవగాహనలో ముఖ్యమైన భాగాలు'' అని ఆయన వివరించారు. ఆహార ధాన్యాల వాణిజ్యం, ముఖ్యంగా భారతదేశం నుండి వచ్చే సుగంధ ద్రవ్యాల వాణిజ్యం ప్రపంచంపై శాశ్వత ప్రభావాన్ని కూడా ఆయన గుర్తించారు. గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ గురించి ప్రస్తావిస్తూ, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ సుస్థిరమైన, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల గురించిన పురాతన జ్ఞానాన్ని అర్థం చేసుకుని అమలు చేయవలసిన అవసరాన్ని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. ప్రపంచం 2023ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకుంటున్నదని శ్రీ మోదీ అంగీకరించారు. ''మిల్లెట్స్ భారతదేశపు 'సూపర్ ఫుడ్ బకెట్'లో ఒక భాగం, ప్రభుత్వం దానిని శ్రీ అన్నగా గుర్తించింది'' అని శ్రీ మోదీ అన్నారు. శతాబ్దాలుగా చాలా నాగరికతలలో ఈ చిరుధాన్యాలకు గొప్ప ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ, గత కొన్ని దశాబ్దాలలో భారతదేశంతో సహా అనేక దేశాలలో ఆహార అలవాటు నుండి పక్కకు తప్పుకోవడంతో, ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యానికి, సుస్థిర వ్యవసాయానికి, అలాగే స్థిరమైన ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని ప్రధాన మంత్రి సూచించారు. ''భారతదేశం చొరవతో, ప్రపంచంలో చిరుధాన్యాలకు సంబంధించి అవగాహన ప్రచారం ప్రారంభమైంది'', అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రభావంతో ప్రపంచంలోని ప్రతి మూలకు మినుములు చేరుకుంటాయన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన జి-20 సదస్సు సందర్భంగా భారత్‌ను సందర్శించే ప్రముఖుల కోసం మిల్లెట్‌లతో తయారు చేసిన వంటకాలతో పాటు మార్కెట్‌లో మినుములతో తయారు చేసిన ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల లభ్యతను ఆయన ప్రస్తావించారు. శ్రీ అన్న వాటాను పెంచే మార్గాలపై చర్చించాలని, పరిశ్రమలకు, రైతులకు వేలు జరిగేలా సామూహిక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రముఖులను కోరారు.

ఢిల్లీ డిక్లరేషన్‌లో జి-20 గ్రూప్ సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత మరియు పౌష్టికాహార భద్రతను ప్రముఖంగా ప్రస్తావించిందని, ఫుడ్ ప్రాసెసింగ్‌తో సంబంధం ఉన్న భాగస్వాములందరి ఆ పాత్రను హైలైట్ చేసిందని శ్రీ మోదీ అన్నారు. ఆహార పంపిణీ కార్యక్రమాన్ని డైవర్సిఫైడ్ ఫుడ్ బాస్కెట్‌గా మార్చాలని, చివరికి పంట తర్వాత నష్టాలను తగ్గించాలని ఆయన నొక్కి చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా వృథాను తగ్గించాలని ఆయన నొక్కి చెప్పారు. వృథాను అరికట్టేందుకు, నిల్వకు ఆస్కారం లేని ఉత్పత్తుల ప్రాసెసింగ్‌ను పెంచాలని, తద్వారా రైతులకు మేలు జరగాలని, ధరల హెచ్చుతగ్గులను నివారించాలని కోరారు. ప్రసంగాన్ని ముగించిన ప్రధాన మంత్రి, రైతుల ప్రయోజనాలకు మరియు వినియోగదారుల సంతృప్తికి మధ్య సమతూకం పాటించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇక్కడ చేసే తీర్మానాలు ప్రపంచానికి స్థిరమైన, ఆహార-భద్రతతో కూడిన భవిష్యత్తుకు పునాది వేస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పశుపతి కుమార్ పరాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్, కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖ సహాయ మంత్రి శ్రీ. పర్షోత్తం రూపాలా, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రహ్లాద్ సింగ్ పటేల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వయం సహాయక బృందాలను బలోపేతం చేసేందుకు, లక్ష మందికి పైగా ఎస్ హెచ్ జీ సభ్యులకు ప్రధాన మంత్రి సీడ్ క్యాపిటల్ సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ మద్దతు మెరుగైన ప్యాకేజింగ్, నాణ్యమైన తయారీ ద్వారా మార్కెట్లో మెరుగైన ధరల వాస్తవికతను పొందేందుకు ఎస్ హెచ్ జీ లకు సహాయం చేస్తుంది. వరల్డ్ ఫుడ్ ఇండియా 2023లో భాగంగా ఫుడ్ స్ట్రీట్‌ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఇందులో ప్రాంతీయ వంటకాలు, రాచరిక వారసత్వ వంటకాలు ఉన్నాయి. ఇందులో 200 మందికి పైగా చెఫ్‌లు పాల్గొని సాంప్రదాయ భారతీయ వంటకాలను చేస్తారు. ఇది ఒక ప్రత్యేకమైన పాక శాస్త్ర అనుభవంగా గోచరించింది.

ఈ కార్యక్రమం భారతదేశాన్ని 'ప్రపంచ ఆహార బాస్కెట్'గా ప్రదర్శించడం, 2023ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా జరుపుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమ నిపుణులు, రైతులు, వ్యవస్థాపకులు, ఇతర వాటాదారులకు చర్చలలో పాల్గొనడానికి, భాగస్వామ్యాలను స్థాపించడానికి, వ్యవసాయ-ఆహార రంగంలో పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి నెట్‌వర్కింగ్, వ్యాపార వేదికను అందిస్తుంది. సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశాలు, పెట్టుబడి, సులభ తర వాణిజ్యంపై దృష్టి పెడతాయి.

భారతీయ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ ఆవిష్కరణ, సామర్థ్యాలను ప్రదర్శించడానికి వివిధ పెవిలియన్లు ఏర్పాటు చేసారు. ఈ ఈవెంట్ లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలోని వివిధ అంశాలపై దృష్టి సారించే 48 సెషన్‌లను నిర్వహిస్తున్నారు. ఆర్థిక సాధికారత, నాణ్యత హామీ, యంత్రాలు, సాంకేతికతలో ఆవిష్కరణలను నొక్కి చెబుతుంది.

ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల సీఈఓలతో సహా 80కి పైగా దేశాల నుండి పాల్గొనేవారికి ఈ ఈవెంట్ ఆతిథ్యం ఇస్తోంది. 1200 మంది విదేశీ కొనుగోలుదారులతో రివర్స్ కొనుగోలుదారు సెల్లర్ మీట్‌ను కూడా కలిగి ఉంటుంది. నెదర్లాండ్స్ భాగస్వామ్య దేశంగా ఉండగా, జపాన్ ఈవెంట్ ఫోకస్ కంట్రీగా ఉంది.

## యూఏఈ అధ్యక్షుడుతో మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 4:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు యుఎఇ ప్రెసిడెంట్ హిస్ హైనెస్ షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో టెలిఫోన్ లో సంభాషించారు.

పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. తీవ్రవాదం, క్షీణిస్తున్న భద్రతా పరిస్థితి, పౌరుల ప్రాణనష్టం పట్ల ఇరువురు నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

శాంతి భద్రతలు, మానవీయ పరిస్థితులను త్వరగా పునరుద్ధరణ జరగాలని ఇద్దరు నేతలు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, సుస్థిరత అనేవే ప్రాముఖ్యత అని అన్నారు.

భారతదేశం-యుఎఇ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య చట్రంలో విభిన్న రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడం కొనసాగించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

## సెప్టెంబర్ త్రైమాసికంలో 9.13 శాతం గ్రోత్ సాధించిన ఎస్బీఐ

న్యూ డిల్లీ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేంద్ర ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంక్.. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) సెప్టెంబర్ త్రైమాసికంలో 9.13 శాతం గ్రోత్ సాధించింది. 2023-24 రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికరలాభం రూ.16,099 కోట్ల నికర లాభం గడించింది. ఏడాది క్రితం 2022-23 రెండో త్రైమాసికం లో నికర లాభం రూ.14,752 కోట్లు, జూన్ త్రైమాసికంలో రూ.18,356 కోట్ల నికర లాభం గడించింది. దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ నెట్ వర్క్ లో ఎస్బీఐది ఐదో స్థానం.కానీ, నికర వడ్డీ ఆదాయంలో మాత్రం మార్కెట్ అంచనాలను బీట్ చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12 శాతానికి పైగా రూ.39,500 కోట్లు నికర వడ్డీ ఆదాయం సముపార్జించింది. మార్కెట్ వర్గాలు రూ.38,500 కోట్ల నికర వడ్డీ ఆదాయం పొందుతుందని అంచనా వేశాయి. సెప్టెంబర్ త్రైమాసికం మొత్తం ఆదాయం 26.4 శాతం పెరిగి రూ.1.12 లక్షల కోట్లకు చేరుకున్నది. గతేడాది రూ.88,733 కోట్ల ఆదాయం పొందింది.స్థూల మొండి బకాయిలు 2.55 శాతంగా ఉన్నాయి. జూన్ త్రైమాసికంలో 2.76 శాతం ఉంటే, గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల మొండి బకాయిలు 3.52 శాతం. ఇక నికర మొండి బకాయిలు గతేడాదితో పోలిస్తే 0.80 శాతం నుంచి 0.64 శాతానికి తగ్గాయి. జూన్ త్రైమాసికంలో 0.71 శాతం నికర మొండిబకాయిలు నిలిచాయి.

## బీసీ బంధువులారా నోటుకు ఓటు అమ్ముడుపోకండి

**-మన ఓట్లు ఎన్నో మన వాట అంత**

నల్లగొండ నవంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీసీ బంధువులారా నోటు కు ఓటు అమ్ముడుపోవద్దని నల్లగొండ జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖదీర్ పిలుపునిచ్చారు.బీసీ కుల బంధువులందరూ ఏకావాలని పిలుపు నిచ్చారు. జరుగుతున్నటువంటి రాజకీయ పరిమాణాలను దృష్టిలో పెట్టుకొని యువకులు, మహిళలు, ఉద్యోగస్తులు బీ.సీ. మరియు మైనారిటీ బంధువులందరూ ఏకం ఐ అందరూ కలిసికట్టుగా ఆలోచించి తమ తమ యొక్క అమూల్యమైన ఓట్లను సంప్రదింపులు చేసి ఒకే నిర్ణయం తీసుకోవాలని పిలుపుని చ్చారు. బి.సి. మైనారిటీ బంధువు లారా మేము రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా, ఎంతో వెనుకబడి ఉన్నాము వేము వెుత్తము బీ.సి.ఎస్సి,ఎస్టి మరియు మైనారిటీలు కలిసి 90 శాతం పైచిలుకు ఓట్లు కలిగి ఉన్నాము కావున ఎలాంటి రాజకీయాలకు లొంగకుండా అందరూ కలిసికట్టుగా ఒకే గొడుగు కింద తమ తమ యొక్క అమూల్యమైన ఓట్లను వినియోగించుకోవాలి. అంతేకాకుండా ఒకసారి ఆలోచించకుండా ఓటుని వేసినందుకు దాదాపు 5 సంవత్సరాలు బాధపడవలసి వస్తుంది కావున అందరూ ఆలోచించి తమ తమ యొక్క నిర్ణయాలను సంప్రదించి ఓట్లను వేయాలని విజ్ఞప్తి చేసారు.

## దేశానికి దారి చూపుతూ నేతన్నలకు అండగా సీఎం కేసీఆర్ - కవిత



నిజామాబాద్, నవంబర్ 4:దేశానికి తెలంగాణ మోడల్ దారిచూపుతోందని, సీఎం కేసీఆర్ పాలన ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. చేనేత కార్మికులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనన్ని కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్రలో చేనేత కార్మికులు పడుతున్న బాధలు, కష్టాలు తీరాలంటే తెలంగాణ అభివృద్ధి నమూనానే ఏకైక పరిష్కారమని అభిప్రాయపడ్డారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఇటీవల సోలాపూర్ కు వెళ్లిన కవిత అక్కడి వస్త్ర పరిశ్రమలను సందర్శించి వాటి నిర్వాహకులతో, కార్మికులతో సంభాషించారు. ఆ సంభాషణ సంబంధిత వీడియోను తన సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు.. మహారాష్ట్రలో వస్త్ర పరిశ్రమలతో. పాటు ఇతర పరిశ్రమలకు నీటి కొరత, విద్యుత్తు కొరత చాలా తీవ్రంగా ఉందని, విద్యుత్తు చార్జీలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని వారు కవిత దృష్టికి తీసుకొచ్చారు. మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేవని వారు చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం వస్త్ర, చేనేత పరిశ్రమదారులు, కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వారు ప్రశంసించారు.

ఈ సందర్భంగా వారితో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో పవర్ లూమ్ పరిశ్రమలకు సీఎం కేసీఆర్, రాష్ట్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి కేటీఆర్ అనేక రాయితీలు కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం 10 శాతం నీటిని కేటాయించామని, దాంతో పరిశ్రమలకు అవసరమైన నీరు అందుతోందని అన్నారు. పరిశ్రమలకు నీటి కొరత, విద్యుత్తు కొరత లేకుండా . సీఎం కేసీఆర్ దూరదృష్టితో అనేక సంస్కరణలు చేపట్టారని వివరించారు. ఈ చర్యల వల్ల పరిశ్రమలు నడుపుతున్న వారికే కాకుండా అందులో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని, కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించగలిగామని స్పష్టం చేశారు. బీడీ కార్మికులకు పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టిన తొలి రాష్ట్రం తెలంగాణ అని, ఇది సీఎం కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. బతుకమ్మ చీరలను రాజకీయం చేసిన కాంగ్రెస్ పార్టీకి మహిళలు కర్రుకాల్చి వాతపెడుతారని అన్నారు.

## ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయండి

**-కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



హైదరాబాద్, నవంబర్ 4:ఎన్నికలు రాగానే ప్రజలు ఆగమాగం కావొద్దు..ఒకప్పుడు కుత్బుల్లాపూర్ ప్రాంతం ఎట్లుండే..ఇప్పుడు ఎలా అయిందో గమనించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని ఆరున్నరవేల కోట్లతో అభివృద్ధి చేశామని, అభివృద్ధిని చూసి ఓటేయాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అభివృద్ధి జరగదన్నారు.

నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ పరిధి.. గోదావరి హోమ్స్ టీఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం, కాలనీల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని, మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేసుకొని నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్‌రాజ్, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, నమ్మన్న, కుంట నిద్దిరాములు, నరేందర్ రెడ్డి, సంపత్‌గౌడ్‌తో పాటు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తండాల బాధలను ఎడబాపింది సీఎం కెసిఆర్..మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



మహబూబాబాద్, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామిణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గం పెద్దవంగర మండలంలో తండా బాటలో తండాలను విస్తృతంగా పర్యటించారు. అలాగే ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఓటర్లను స్వయంగా కలిశారు. వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఒక్కో తండాను అనేక అభివృద్ధి పనులతో, సంక్షేమ కార్యక్రమాలతో గతంలో కనీవినీ ఎరగని రీతిలో తండాలను సైతం గ్రామాలకు ధీటుగా అభివృద్ధి పరచిన ఘనత, సీఎం కేసీఆర్ కి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, నాయకులు శ్రీరామ్ సుధీర్, గాంధీ నాయక్ ,రవీందర్ నాయక్, ఈరెంటి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా తండాల సర్పంచులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు

## ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వర్తించాలి

**-సంగారెడ్డి నియోజకవర్గ వ్యయ పరిశీలకులు కె.పి. జయకర్**

సంగారెడ్డి, నవంబర్ 4 (నేటి నిజం ప్రతినిధి) ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ అత్యంత ముఖ్యమైనదని, సంబంధిత పర్యవేక్షణ బృందాలు అన్నివేళలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సంగారెడ్డి అసెంబ్లి నియోజకవర్గ వ్యయ పరిశీలకులు కె పి. జయకర్ అన్నారు.

శనివారం సంగారెడ్డి నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు జయకర్ సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు.

సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ , స్టాటిక్ సర్వైలెన్స్ టీం, వీడియో సర్వే లైన్స్ టీమ్ లతో సమావేశం నిర్వహించి, ఆయా టీమ్ ల విధులు, నిర్వహిస్తున్న రికార్డులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని, వ్యయ పరిశీలన బృందం అభ్యర్థుల వ్యయంపై షాడో రిజిష్టర్లు నిర్వహించాలన్నారు.

ఎన్నికల వ్యయ నిర్వహణపై అవగాహన కల్పించారు.

ఎక్కడ ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుండి ఏవైనా ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా బృందాలకు ఆదేశించారు.

సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ , తదితర బృందాల పనితీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసారు. అన్ని రికార్డులను పరిశీలించి బాగా చేస్తున్నారని కితాబు నిచ్చారు.

ఈ సమీక్షలో సహాయ వ్యయ పరిశీలకులు సిద్ధారెడ్డి, అకౌంటింగ్ టీం హెడ్ శ్రీమతి ఇందిర, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం హెడ్స్, ఎస్ ఎస్ టి, వి ఎస్ టి, వి వి టి బృందాల హెడ్స్ పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌పై గల్ఫ్ కార్మికుల పక్షాన పోటీ

**-ఈ నెల 9న సిరిసిల్లలో నామినేషన్ వేయనున్న దొనికేని కృష్ణ**

రాజన్న సిరిసిల్ల, నవంబర్4:(నేటినిజం ప్రతినిధి); తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ గల్ఫ్ కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా రానున్న అసెంబ్లి ఎన్నికల్లో గల్ఫ్ కార్మికులు పోటీకి సిద్ధమయ్యారు. తమ హక్కులను తామే సాధించుకునేందుకు వ్యూహాత్మంగా ప్రణాళికను రూపొందించుకున్నారు. ఈ మేరకు సిరిసిల్ల నియోజకవర్గం నుండి రాష్ట్ర మంత్రి కేటీఆర్ పై గల్ఫ్ కార్మికుల పక్షాన జీడబ్ల్యూఏసి కన్వీనర్ దొనికని కృష్ణను పోటీలో దింపారు. ఈ నెల 9న సిరిసిల్లలో గల్ఫ్ కార్మికుల కుటుంబాల అధ్వర్యంలో నామినేషన్ వేయనున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని గల్ఫ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నారై పాలసీ సాధన కోసం ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నపం చేసిన పట్టించుకోవడం లేదన్నారు. అన్ని దేశాల్లో గల్ఫ్ సంఘాలను ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికుల సమస్యలపై అవగాహన కల్పిస్తున్న కూడా సమస్యలు పరిష్కారం కావడం లేద న్నారు. గతంలో కేసీఆర్ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఎన్ఆర్ఎస్ఐ పాలసీని ఏర్పాటు చేసి, చనిపోయిన కార్మికులకురూ. 5లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించి ఏజెంట్ల మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటివరకు గల్ఫ్ కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణఏర్పడినప్పటి నుంచి దాదాపు 2వేల మందికి పైగా గల్ఫ్ కార్మికులు మృతిచెందారని, వారి కుటుంబాలు అనాథలుగా మారారని తమ గోసను వెళ్ళబోసకున్నారు. తెలంగాణలో అభివృద్ధి జరిగితే ఇక్కడున్న వారు గల్ఫ్ దేశాలకు ఎందుకు వలస వెళ్తున్నారని ప్రశ్నించారు. సిరిసిల్ల, కామారెడ్డి, వేము లవాడ, మానకొండూర్ తదితర నియోజకవర్గాల్లో గల్ఫ్ కార్మికుల తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గల్ఫ్ కార్మికుల సత్తా ఏందో చూపిస్తామని హెచ్చరించారు. సిరిసిల్లలో నిర్వహించే నామినేషన్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గల్ఫ్ కార్మికుల కుటుంబాలు పాల్గొని తమ ఐక్యమత్యాన్ని ప్రభుత్వానికి చూపించాలని పిలుపునిచ్చారు.

## కౌంటింగ్ సెంటర్ల లో కట్టుదిట్టమైన ఏర్పట్లు చేయాలి-జిల్లా ఎన్నిక అధికారి/కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 4:(నేటినిజం ప్రతినిధి):సాధారణ ఎన్నికలు 2023 లో బాగంగా స్థానిక జఖఖీ ఇంజనీరింగ్ కలశాల లో శనివారం , మెదక్ 34, నర్సాపూర్ 37 ,నియోజక వర్గ లా కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తో,జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కౌంటింగ్ సెంటర్ లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్ నెట్.మీడియా పాయింట్, బారికేడ్లను,విద్యుత్ సరఫరా ,త్రాగునీరు , లాంటి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ , , మెదక్, హవేలీఘణపుర్ తహసీల్దార్ లు శ్రీనివాస్ , నారాయణ ఆర్ అండ్ బి అధికారి సర్దార్ సింగ్ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

# నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతన్న పోరాటమిది : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 4:దొరల తెంగాణ కావాల్నా.. ప్రజల తెలంగాణ కావాల్నా.. అని మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. నిజంగా ఈ రోజు జరుగుతున్న పోరాటం.. నవంబర్ 30న ఢిల్లీ దొరలకు, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పంచాయితీ ఇది అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ జలవిహార్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ న్యాయవాదుల సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

1952లో ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే ఈ ఢిల్లీ దొర రాహుల్ గాంధీ ముత్తాత జవహర్ లాల్ నెహ్రూ. 1952లో సిటీ కాలేజీ వేదికగా ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అని నినదించిన ఐదు మంది పిల్లలను కాల్చి చంపింది ఈ ఢిల్లీ దొర రాహుల్ ముత్తాత. 1956లో ఇష్టం లేని పెళ్లి చేసింది కూడా ఢిల్లీ దొర నెహ్రూనే. 1968లో విద్యార్థులు, విద్యావంతులు, న్యాయవాదులు, మేధావులు కలిసి ఖమ్మం జిల్లాలో ఉద్యమం ప్రారంభిస్తే ఆ సందర్భంగా 370 మంది పిల్లలను పిట్టల్లా కాల్చి చంపించింది ఇదే ఢిల్లీ దొర రాహుల్ గాంధీ నాయినమ్మ ఇందిరమ్మ. 1971లో తెలంగాణ ప్రజలు తమ గుండెను చీల్చి, ఆత్మను ఆవిష్కరించి.. 11 ఎంపీలు సీట్లు మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితికి అప్పగిస్తే.. వాళ్లందరిని గొర్రెల మాదిరిగా గుంజుకుపోయి కాంగ్రెస్‌లో కలుపుకొని, ప్రజల తీర్పును అపహాస్యం చేసింది ఇదే ఢిల్లీ దొర రాహుల్ నాయినమ్మ ఇందిర. 2004 ఎన్నికల సందర్భంలో తియ్యటి మాటలు చెప్పి, తెలంగాణ ఇస్తామని నమ్మబలికి, పదేండ్లు చావగొట్టి, వందల మంది ప్రాణాలు తీసింది ఇదే ఢిల్లీ దొర రాహుల్ తల్లి సోనియా గాంధీ. ఇవన్నీ వాస్తవాలు.. నేను చెప్పట్లేదు అని కేటీఆర్ తెలిపారు.

## చావనైనా చస్తాం కానీ.. ఢిల్లీ దొరల ముందు తల దించం..

2014 దాకా ఢిల్లీ దొరలతో కొట్లాడినం తెలంగాణ కోసం. 2014 తర్వాత మరొక దొర.. నరేంద్ర మోదీతో కొట్లాడుతున్నాం. తెలంగాణను అవమానించేలా మాట్లాడుతున్నారు. హైకోర్టు విభజనకు ఐదేండ్ల సమయం తీసుకున్నారు. అది మాత్రమే కాదు.. తెలంగాణ మెడ మీద కత్తి పెట్టి లొంగదీసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా.. ఈ దొరతోని కూడా కొట్లాడుతున్నాం. చావనైనా చస్తాం కానీ.. ఈ ఢిల్లీ దొరల ముందు ఎట్టి పరిస్థితుల్లో కేసీఆర్ గానీ, బీఆర్ఎస్ పార్టీ గానీ తల దించదు. ఎందుకంటే మాకు ఆ చిత్తశుద్ధి ఉంది. తెలంగాణ సాధించిన బిడ్డలుగా రోషం, పౌరుషం ఉంది. ఈ సన్నాసుల ముందు ఎన్నటికీ తల దించం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ - కర్ణాటక సరిహద్దుల్లో 9 అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు

హైదరాబాద్, నవంబర్ 4:తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలతో పాటు మనషుల కదలికలపై పోలీసులు నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో తెలంగాణ – కర్ణాటక సరిహద్దుల్లో 9 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు.

ఈ ఇంటర్ స్టేట్ చెక్ పోస్టుల వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. తరుచుగా చెక్‌పోస్టులను తనిఖీలు చేసి, ఎప్పటికప్పుడు పోలీసులను అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు సంగారెడ్డి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే సరిహద్దుల్లో 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ. 2.41 కోట్ల నగదు, రూ. 24.77 లక్షల విలువ చేసే మద్యం, రూ. 4.51 కోట్ల విలువ చేసే 6 కిలోల బంగారం, రూ. 19.60 లక్షల విలువ చేసే 21 కిలోల వెండిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. 348 కేసులు నమోదు అయినట్లు వెల్లడించారు.

# కరీంనగర్‌పై గులాబీ జెండా ఎగురవేస్తాం : మంత్రి గంగుల



కరీంనగర్, నవంబర్ 4:తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగుర వేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. పద్మనాయక కల్యాణ మండలంలో బీఆర్టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్మికులు సమష్టి కృషితో ముందుకెళ్లాలన్నారు.కార్మికులు లేబర్ యాక్ట్ ప్రకారం విధిగా బీమా చేయించుకోవాలని.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అభివృద్ధికి పాటుపడుతానన్నారు. సహాయ సహకారాలు అందిస్తానన్నారు. స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ, కాంగ్రెస్‌లు ఒక్కటవుతాయని.. కేసీఆర్‌ను ఓడించేందుకు కుట్నపన్నుతున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఒక్కసారైనా జై తెలంగాణ అని అన్నాడని ప్రశ్నించారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో కలిపే కుట్ర జరుగుతుందని.. విలువైన ఓటును కారు గుర్తును గెలిపించాలని కోరారు.

# పార్టీ బాగుంటేనే అందరం బాగుంటాం

**-ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి**
**-గులాబీ జెండాతోనే మనందరికీ గౌరవం**
**-ఎన్నికల్లో ధైర్యంగా ఓట్లు అడిగే హక్కు కేవలం మనకే ఉంది**
**-పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి**

రాజన్న సిరిసిల్ల, నవంబర్4:(నేటినిజం ప్రతినిధి): ఎన్నికలు ఏవైనా గెలుపులో మాత్రం బూత్ కమిటీ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని బి.ఆర్.ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు అభిప్రాయపడ్డారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో



శనివారం బి.ఆర్.ఎస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్ పర్సన్ అరుణ–రాఘవ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహా రావు మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ పార్టీ బాగుంటేనే మనందరం బాగుంటామని, పార్టీతోనే అందరికి గౌరవం దక్కుతుందని అన్నారు.

ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఎన్నికల్లో మనకు మనమే పోటీ తప్ప, మనకు ఎవరు పోటీ లేరని, ఈ రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు బి.ఆర్.ఎస్ పార్టీకే ఉందని, అందరూ కలిసి కట్టుగా పని చేసి, తనను గెలిపిస్తేనే సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతాడని, సేవ చేయాలనే ఆశయంతో, అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నానని, అందరూ కష్టపడి పని చేసి మండలంలో 10వేల మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని, రాబోయే రోజుల్లో బి.ఆర్.ఎస్ కుటుంబ సభ్యులను కడుపులో పెట్టి కాపాడుకుంటా అంటూ భరోసా కల్పించారు. జడ్పీ చైర్ పర్సన్ అరుణ–రాఘవ రెడ్డి మాట్లాడుతూ జడ్పీటీసీ ఎన్నికల్లో ఎట్లాగైతే తన గెలుపు కొరకు కలిసికట్టుగా పని చేసి, కారు గుర్తు గెలుపు కొరకు కృషి చేయాలని సూచించారు. తమ మండల బిడ్డగా,అభివృద్ధి చేయాలనే ఆశయంతో ముందుకు వస్తున్న చల్మెడను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మార్క్ ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు గోపు పర్శరాములు, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్ రావు, మహిళ విభాగం అధ్యక్షురాలు సంధ్య, మాజీ ఎంపీపీ మ్యాకల రజని, యువజన విభాగం అధ్యక్షుడు జీవన్ గౌడ్ లతో పాటు మండలంలోని అన్ని బూత్ కమిటీల బాధ్యులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదివాసీల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి : మంత్రి సత్యవతి

ములుగు , నవంబర్ 4: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలోని గిరిజనులు, ఆదివాసీల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ఓ ఫంక్షన్ హాలులో బంజారా సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ములుగును అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని.. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, సౌభాగ్యలక్ష్మి కింద రూ.3వేలు ఇవ్వడంతో పాటు తెల్లరేషన్‌కార్డు దారులకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు.

కాంగ్రెస్ పాలనలో బంజారాలకు చేసిందేమీలేదని, మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అంటూ విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కర్నాటక తరహాలోనే కరెంటు కష్టాలు తెలంగాణలో పునరావృతమవుతాయన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని.. అక్కడ ఐదుగంటల కరెంటు ఇస్తున్నారన్నారు. తెలంగాణలో 3గంటల పార్టీ కరెంటు చాలని పీసీసీ



అధ్యక్షుడు అంటునాన్డన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ 24గంటల పాటు రైతాంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. రైతులపై ఉన్న ప్రేమ, చిత్తశుద్ధితో సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

ఆ పార్టీకి మాత్రం రైతులపై ఎలాంటి మమకారం, చిత్తశుద్ధి లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో తండాలను జీపీలుగా చేసిన నేత సీఎం కేసీఆర్ అన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో లంబాడా జాతికి ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు బీజేపీ అన్యాయం చేసిందని మండిపడ్డారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదని, పదేళ్లపాటు గిరిజన యూనివర్సిటీ ఇవ్వకుండా కాలయాపన చేసి ద్రోహం చేసిందన్నారు. నీళ్ల కోసం కిలోమీటర్లు నడిచిన పరిస్థితి నుంచి తెలంగాణ వచ్చిన తర్వాత స్వయం పాలన దిశగా అడుగులు పడ్డాయన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని ప్రజలు ఆశీర్వదించి.. భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# కుల సంఘాల ఏకమై బిసి బిడ్డగా తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి



**-వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అది శ్రీనివాస్..**
**-7 వ తేదీన నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలంటు పిలుపు**

రాజన్న సిరిసిల్ల, నవంబర్4: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణం రాష్ట్రంలో నవంబర్ 30 నాడు జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో వేములవాడ కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా అది శ్రీనివాస్ 7 తేదీన తను నామినేషన్ దాఖలు చేయబోతున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వేములవాడ నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు..

ఈ నెల 7 తేదీ మంగళవారం రోజున 12 గంటలకు తన నామినేషన్ వేయబోతున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమనికి నియోజకవర్గ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ మద్దతు తెలపాలని కోరారు.తమ మద్దతు చూసి అధికార పార్టీలో వణుకు మొదలై వేములవాడ ప్రజలు మార్పు కోరుతున్నారిని తెలియజేయాలని పిలుపునిచ్చారు..తాము గడప గడప ప్రచారం కోసం వచ్చినప్పుడు మీరు చూపిన అభిమానాన్ని,ప్రేమను నామినేషన్ రోజు కూడా వచ్చి తెలుపలన్నారు..మీ బిడ్డగా వస్తున్నాని నాకు ఒక్క అవకాశం ఇచ్చి మీకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు.

# బుల్లెట్ పై వచ్చి నామినేషన్ వేసిన రాజా సింగ్

హైదరాబాద్, నవంబర్ 4: గోషామహల్ నియోజకవర్గ భాజపా అభ్యర్థి రాజాసింగ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తన అనుచరులతో కలిసి ఎలాంటి ఆర్భాటం లేకుండా.. బుల్లెట్‌పై వచ్చి అబిడ్స్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాజాసింగ్ వెంట పెద్ద ఎత్తున వచ్చిన భాజపా నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో.. నలుగురితో కలిసి అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్లారు. నలుగురితో కలిసి అబిడ్స్ జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్లి నామినేషన్ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలుకు ముందు రాజాసింగ్ మాట్లాడుతూ గోషామహల్‌లో బీఆర్ఎస్ ఇప్పటి వరకు తన అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది మజ్లిస్ పార్టీ కార్యాలయంలో ఇంకా నిర్ణయించలేదని ఎద్దేవా చేశారు. 2014, 2019 ఎన్నికల్లో ధనబలంతో గెలవాలని ప్రతిపక్షాలు చూసినప్పటికీ, గోషామహల్ ప్రజలు తనను ఆశీర్వదించారని చెప్పారు. ఇక్కడకు వచ్చిన వారంతా తమ వానరా సేన అన్నారు. మూడోసారి కూడా తనే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి గెలిచి బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీకి గుణపాఠం చెబుతామన్నారు.

# దేవరకొండలో నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్ర కుమార్



నల్లగొండ, నవంబర్ 4: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం కొనసాగుతున్నది. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడి కావడంతో జోరుగా నామినేషన్‌ల పర్వం కొనసాగుతున్నది

. దేవరకొండ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

అంతకుముందు రవీంద్రకుమార్.. దేవరకొండ మండలం కమలాపూర్ గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల నుంచి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం దేవరకొండ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ గుత్తా అమిత్ రెడ్డి, సీనియర్ నాయకులు నాయిని సుధీర్ రెడ్డి, వడ్త్యా రమేష్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డిలతో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

# 'సప్త సాగరాలు దాటి సైడ్ - ట్రైలర్ రిలీజ్..




హైదరాబాద్, నవంబర్ 4:కన్నడ నటుడు రక్షిత్ శెట్టి హీరోగా తెరకెక్కిన సినిమా 'సప్త సాగరదాచే ఎల్లో'.. హేమంత్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా కర్ణాటకలో హిట్ టాక్ అందుకున్న ఈ మూవీ తెలుగులో 'సప్త సాగరాలు దాటి' అనే పేరుతో రిలీజ్ అయ్యింది. రుక్మిణి వసంత్ ఇందులో హీరోయిన్ గా నటించింది.

తాజాగా సప్త సాగరాలు దాటి సైడ్ ః ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇక ఈ మూవీ నవంబర్ 17న థియేటర్స్ లోకి రానుండగా.. తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళం భాషల్లో ఒకేసారి రిలీజ్ చేయనునారు. మరి ఈ సినిమా ప్రేక్షకులని ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# బీఆర్ఎస్‌ది పేదల ప్రభుత్వం.. మరోసారి ఆశీర్వదించాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నవంబర్ 4: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సర్కారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మారెమ్మకుంట నుంచి గాంధీనగర్ వరకు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఓటర్లను కలుస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పని చేస్తుందన్నారు. పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ప్రజల అవసరాలు, అభ్యున్నతి లక్ష్యంగా రూపొందించిందన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ పంటలను కొనుగోలు చేస్తుందన్నారు. రాబోయే ఐదేళ్లలో రైతుబంధును రూ.10వేల నుంచి రూ.16వేలకు పెంచుతామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలందరికీ నెలకు రూ.3వేలు, వచ్చే ఏడాది ఏప్రిల్ ? మే నుంచి రేషన్‌కార్డులపై సన్నబియ్యం సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. స్వశక్తి మహిళా సంఘాలకు దశలవారీగా సొంత భవనాల నిర్మాణం చేపడుతామని మంత్రి వివరించారు. ఆసరా పింఛన్‌తో ఆసరాగా నిలుస్తుందన్నారు.

దళితులను గత ప్రభుత్వాలు కేవలం ఓట్ల కోసమే వాడుకున్నారని..



ఎన్నడూ వారి అభివృద్ధి కోసం ఆలోచించిన పాపన పోలేదన్నారు. దళితులు ఆర్థికంగా ఎదగాలని.. అప్పుడే సమాజంలో ఉన్నతంగా ఉంటారన్నారు. వనపర్తిని జిల్లా చేయడమే కాకుండా పరిపాలన భవనాల నిర్మాణం, నూతన ఉన్నత విద్యాసంస్థల రాకతో రాబోయే ఐదేళ్లలో పట్టణం పెద్ద ఎత్తున విస్తరిస్తుందని చెప్పారు. రహదారుల విస్తరణతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టామని, జరుగుతున్న అభివృద్ధి మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు మరోసారి ఆశీర్వదించి, అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు.

